Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

ఆదివారం, మే 03, 2026 | సంపుటి - 20 | సంచిక 228 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు
### మరోమారు మెలిక పెట్టిన ట్రంప్



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 2లో

## ఉద్యోగుల సంక్షేమానికి
# కట్టుబడి ఉన్నాం



### రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
### జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
### ఉద్యోగ సంఘాలతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకు లతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశం సించారు. వారి సహకారం తోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలు గుతున్నామని కొనియాడారు. 2లో



### సిబ్బంది, ప్రయాణికులతో
## మర్యాదగా ఉండాలి
### వేధింపులకు గురిచేయడం సరికాదు
### ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

హైదరాబాద్ : కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శు క్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహ పూర్వకంగా పనులు చేయించు కోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. 2లో



## సుప్రీంలో మమతా బెనర్జీకి
# చుక్కెదురు
### కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం

న్యూఢిల్లీ,మే2 : సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేన ని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

తరువాయి 2లో



### సర్వోదయ తెలంగాణ కోసం
## పాంచజన్యం పూరించాం
### అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
### ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
### ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
### మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత

హైదరాబాద్ : తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తా మన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు.

తరువాయి 2లో



### సిరిసిల్ల వాసుల మృతిపై
# కెటిఆర్ సంతాపం
### ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి

హైదరాబాద్ : శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళు లర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 2లో

### ఎండాకాలంలో కోతలు
# ఉండకూడదు
### సరఫరాలో ఎక్కడా లోటు రానీయవద్దు
### అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచన



అమరావతి : వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధ రించాలని ఆదేశించారు. ఉత్పత్తి , సరఫ రాలో ఎక్కడా లోటు రానీయ వద్దన్నారు. శనివారం విద్యుత్ సీఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో అధికారులకు పలు కీలక ఆదే శాలు జారీ చేశారు. అధికారికంగా లేదా అనధికారికంగా ఏపీలో ఎక్కడా కరెంట్ కోతలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ కోతలు విధించాల్సి వస్తే ప్రజలకు ఆ సమాచారం చెప్పటంతో పాటు వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. తరువాయి 2లో



### కార్మికుల సంక్షేమం కోసమే
## లేబడర్ అడ్డాలు
### వాటిని ననైపుణ్య శిక్షణ్యా కేంద్రలుగా మారుస్తున్నాం
### మంత్రి వాసంశెట్టి శుభాశ్ వెల్లడి

అమరావతి : ముఖ్యమంత్రి చంద్ర బాబు ఓ కార్మికుడిలా శ్రమిస్తూ కార్మికుల భద్రత, సంక్షేమం, అభి వృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తు న్నారని మంత్రి వాసంశెట్టి శుభాశ్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే లేబర్ అడ్డా నిర్మాణాలు.. అందరికీ పని దొరికేలా చూడ టంతో పాటు నైపుణ్య శిక్షణా కేంద్రాలుగానూ మారతాయన్నారు. అమరావతి, పోలవరం సహా వివిధ పెట్టుబడుల నిర్మాణాలకు సంబంధించి

తరువాయి 2లో

### పాశ్చాత్య ప్రభావంతో
# మనదేశంలోనూ మార్పులు
### సమాజంలో కొరవడుతున్న ప్రశాంతత
### ఆధ్యాత్మిక చింతనతోనే పరిష్కారం
### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.

# సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం



16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# అమెరికాలోనే ఇంధన ధరల మోత

## సర్వీసులను నిలిపివేసిన స్పిరిటి ఎయిర్‌లైన్స్ సంస్థ

న్యూయార్క్‌మే2 : ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజగా ప్రకటించింది. త్వరలో అన్ని కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెడతామని శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్నామని, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మరోదారి లేక ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ వెల్లడించింది. 'అన్ని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సర్వీసులను రద్దు చేశాము. మా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు వెళ్లవద్దని సూచిస్తున్నాము' అని ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కస్టమర్ సర్వీస్ అందుబాటులో లేదని కూడా సంస్థ వెబ్‌సైట్‌లో నోటీసు కనిపించింది. అయితే, ఇప్పటికే టికెట్లు కొన్న వారికి డబ్బుల రీఫండ్ పక్రియను త్వరలో ప్రారంభిస్తామని కూడా సంస్థ తెలిపింది. ఇక స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల నిలిపివేతపై కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న సంస్థ పునర్వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌పై బాండ్ హోల్డర్స్‌తో మార్చి నెలలో అంగీకారం కుదిరిరిందన్నారు. అయితే, అకస్మాత్తుగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని అన్నారు. కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయడం మినహా మరో దారి లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. 'వ్యాపారాన్ని కొనసాగించేందుకు వందల మిలియన్ల నిధులు కావాలి. మా వద్ద అంత డబ్బు లేదు. నిధులను సమీకరించే అవకాశం కూడా లేదు. ఇది చాలా విచారకరమైన పరిణామం' అని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక అమెరికాలో విమాన ఇంధన ధరలు రెండింతలు అయ్యాయి. దీంతో, అనేక ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ ఏడాది లాభాల అంచనాలను తగ్గించుకున్నాయి. కార్యకలాపాల విస్తరణపై పెట్టుబడులకు కూడా బ్రేక్ చెప్పాయి. అప్పుల భారం, కార్యనిర్వహణ వైఫల్యాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ 2024 నవంబర్‌లోనే దివాలా తీసినట్టు ప్రకటించింది. ఆ తరువాత పునర్వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌లో భాగంగా మళ్లీ కార్యకలాపాలను ప్రారంభించింది. కంపెనీని పూర్తిగా గ్టటెక్కించేందుకు మరో ప్రణాళికపై కూడా చర్చలు జరుగుతున్నాయి. సంస్థను ఆదుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం ఒక ఎ÷-లాన్‌ను ప్రతిపాదించింది. ఇదే తన చివరి ఆఫర్ అని కూడా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలోనే శనివారం స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బులేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

# పాశ్చాత్య ప్రభావంతో మనదేశంలోనూ మార్పులు

నెల్లూరు : పాశ్చాత్య వ్యామోహం ఎక్కువై మనదేశంలో కూడా మార్పులు వస్తున్నాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తెలిపారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఎక్కడ చూసినా నేరాలు, ఘోరాలు, అశాంతి కనిపిస్తోందని అన్నారు. ఈ క్రమంలో మనిషి ఆధ్యాత్మిక జీవనం అలవర్చుకోవాలన్నారు. శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర, విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్రమే సమయాన్ని కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. సమాజం గతితప్పినప్పుడే వారిని సరైన మార్గంలో పెట్టేందుకు దివ్య స్వరూపులైన యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పుట్టపర్తి సాయిబాబా, షిర్డీ సాయిబాబా లాంటి అవధూతలు భూమిపైకి వచ్చారని ప్రస్తావించారు. ఏదైనా పని చేయాలంటే మనసులో, కుటుంబంలో, గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా శాంతి ఉండాలని సూచించారు. ఏపీ విద్యశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. ఈ ఏడాది పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పాయ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో నాలుగుసార్లు కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతి పదవులు స్వీకరించానని ప్రస్తావించారు. తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌లతో... వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోనని, తన రాజకీయాల్లోకి వారు రావొద్దనే గౌరవ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని వెంకయ్యనాయుడు సూచించారు.

# ఓట్ల లెక్కంపులో ఇసి మరో కీలక నిర్ణయం

## అదనపు పరిశీలకులను నియిమస్తూ ఆదేశాలు

కోల్‌కతా,మే2 : ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల సంఘం అదనపు పరిశీలకులను మోహరించింది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాల్లో మొత్తం 165 మంది ఎన్నికల, 77 మంది పోలీసులను పరిశీలకులుగా నియమించింది. ఓట్ల లెక్కింపు పక్రియ సురక్షితంగా, పారదర్శకంగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతల ఏర్పాట్లను పోలీసు పరిశీలకులు పర్యవేక్షిస్తారని తెలిపింది. ఈసీఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు పేర్కొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికి 86 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మరోవైపు ఓట్ల లెక్కింపు తర్వాత తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇదే జిల్లాలోని ఫల్తాలో వందలాది మంది నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలోని టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణ హాని ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తమపై దాడులు చేస్తామని వారు బెదిరించారని ఆరోపించారు. సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఆ ప్రాంతాన్ని సందర్శించి.. భద్రతకు భరోసా ఇచ్చారు. స్థానిక తృణమూల్ అభ్యర్థి జహంగీర్ ఖాన్ ఈ ఆరోపణలను ఖండించారు. ఇదంతా భాజపా పనేనని ఆరోపించారు.

# బీమా రంగంలో వందశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులు

## ఎల్ఐసిలో మాత్రం 20శాతానికే పరిమితం

## చట్టానికి చేసిన మార్పులపై కేంద్రం నోటిఫై

న్యూఢిల్లీ,మే2 : బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిబ్బంది, ప్రయాణకులతో మర్యాదగా ఉండాలి



మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎ÷-లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో కోతలు ఉండకూడదు

వేసవి డిమాండ్‌కు తగ్గట్లుగా సరిపడా కరెంట్ అందుబాటులో ఉన్నా అక్కడక్కడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని మంత్రి ఆరా తీశారు. అధిక ఉష్ణోగ్రతలతో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవటం, అకాల వర్షాల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

# కార్మికుల సంక్షేమం కోసమే లేబదర్ అడ్డాలు

కార్మికులకు అపార అవకాశాలు రాష్ట్రంలోనే ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేసిందని మంత్రి విమర్శించారు. ఇసుకను బంగారం చేసి, ఒక ఇటుక కూడా పేర్చక పోగా కార్మికుల భద్రత విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి లేనట్లుగా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, కొత్త ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గాయన్నారు. మన మిత్ర యాప్ ద్వారా భవన నిర్మాణ కార్మికులకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రజలే తన యజమానులు అంటూ రోజుకు 18 గంటల పాటు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిరంతర శ్రామికుల్లా పని చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాశ్ పేర్కొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

సిద్దిపేట,మే2 : రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కోనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

# హోర్ముజ్ జలసంధిపై కొత్త నియమాలు

**పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు**

**ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన**




టెహ్రాన్,మే2 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం, ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్టు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, ’పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం’ అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా ’ప్రెస్ టీవీ’ తెలిపింది. మరోవైపు.. హర్మూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

## జూలూరుపాడులో నేడు హిందూ సమ్మేళనం

ఖమ్మం,మే2 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ రోడ్డు, గుండెపుడి సమీపంలో గల ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ‘హిందూ సమ్మేళనం‘ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను కమిటీ సభ్యులు విడుదల చేశారు. ?ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సొడె శ్రీరామ్ మాట్లాడుతూ.. ‘గడప లోపల కులం.. గడప దాటితే మనమంతా హిందువులం‘ అనే నినాదంతో ఈ భారీ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉన్న భేదాలను పక్కన పెట్టి, ధార్మిక, సాంస్కృతిక విలువలను రక్షించుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఐక్యతా సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఈ సమ్మేళనం చారిత్రాత్మకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ, హిందూ బంధువులంతా స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చెంగల నరసింహారావు, వందనపు కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ

హైదరాబాద్,మే2 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు.తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతు తెలిపారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లిపై పరువనష్టం కేసు

**మాజీమంత్రి షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్ దాఖలు**

కామారెడ్డి,మే2 : కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సుమంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయవాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియజేశారు. గత ఫిబ్రవరి 17, 21 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్‌పై అత్యాచారం కేసు ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో ఫిర్యాదు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. క్రిమినల్ డిఫెన్స్ కింద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఈ నెల 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్లు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య

న్యూఢిల్లీ,మే2 : దక్షిణ ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రాంతంలో జడ్జి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. జడ్జి అమన్ కుమార్ శర్మ (30) మృతదేహాన్ని ఆయన ఇంట్లో చూసిన బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వారు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జడ్జి అమన్ కుమార్ శర్మ 2018లో సింబయాసిస్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2019 జూన్ 19న ఢిల్లీ జుడీషియల్ సర్వీసెస్‌లో చేరారు. తన కెరీర్‌లో ఆయన పలు కోర్టుల్లో వివిధ సివిల్, క్రిమినల్ కేసులను డీల్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆయన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు.

### కర్మన్ ఘాట్ ఆంజనేయుడి సేవలో అభిశేక్ శర్మ

**దర్శనం కల్పించిన ఆలయ అధికారులు**

హైదరాబాద్,మే2 : సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ అభిషేక్ శర్మ హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించాడు. శనివారం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశాడు. అతడికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను అభిషేక్ శర్మ.. తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. దీంతో అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గతంలో కూడా అతడు నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయాలను దర్శించుకున్నాడు. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఉప్పల్ వేదికగా తలపడనుంది. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చిన అభిషేక్ శర్మ.. ప్రముఖ ఆలయాలను దర్శించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత ప్రదర్శనలు చేస్తోంది. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో ఆరు గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. టోర్నీ ఆరంభంలో కాస్త తడబడినప్పటికీ.. తిరిగి పుంజుకుని గత ఐదు మ్యాచుల్లో వరుసగా విజయాలు సాధించింది. కాగా అభిషేక్ శర్మ 9 మ్యాచుల్లో 425 పరుగులు చేశాడు. ఇందులో 40 ఫోర్లు, 31 సిక్స్‌లు ఉన్నాయి. ఈ సీజన్‌లో అభిషేక్.. ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు బాది అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు.

## సంపన్న అమ్మాయిలే టార్గెట్

**ఇన్‌స్టా వేదికగా వలపు వల.. ట్రాప్ చేసి లక్షల్లో వసూళ్లు**

**ఇద్దరు కేడీల్లో ఒకరి అరెస్ట్**

హైదరాబాద్,మే2 : ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతులను, ముఖ్యంగా సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మాయిలను మాయమాటలతో ట్రాప్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న అర్జున్, అతని సోదరుడు రాజీవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో అర్జున్, రాజీవ్‌ను ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ అమ్మాయిలను బుట్టలో వేసుకోవడం నిందితుల ప్లాన్ అని పోలీసులు చెప్పారు. ఇప్పటికే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మోసాల్లో రాజీవ్ క్రియాశీలకంగా వ్యవహరించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. పరారీలో ఉన్న రాజీవ్‌ను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బెంగళూరులో పట్టుకున్నారు. నిందితులు యువతులను ట్రాప్ చేయడానికి ఒక పక్కా ప్లాన్ ప్రకారం వ్యవహరించేవారని పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాసవంతమైన హోటల్స్‌లో దిగిన రీల్స్, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారని అన్నారు. తాము కూడా పెద్ద ధనవంతులమని యువతులను నమ్మించేవారని చెప్పారు. హైదరాబాద్‌లోని విలాసవంతమైన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో నివసించే సంపన్న కుటుంబాల పిల్లలను ఈ నిందితులు ప్రధానంగా లక్ష్యంగా చేసుకునేవారని వెల్లడించారు. అమ్మాయిలను పరిచయం చేసుకున్న కొద్దిరోజులకే ప్రేమ నటిస్తూ, పెళ్లి చేసుకుంటామని నమ్మబలికేవారని అన్నారు. యువతుల నమ్మకాన్ని పొందిన తర్వాత అసలు పని మొదలుపెట్టేవారని తెలిపారు. సాన్నిహిత్యం పెరిగిన తర్వాత అమ్మాయిల వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి, వాటిని అడ్డం పెట్టుకుని భయపెట్టడం, అత్యవసరాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసేవారని పోలీసులు వెల్లడించారు. నిందితులు దాదాపు 10 మందికి పైగా యువతులను ఇదే తరహాలో ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెను కూడా ప్రేమ పేరుతో వేధించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ సుమారు రూ. 13 లక్షల నగదును వసూల్ చేశారని పోలీసులు తెలిపారు. నిందితుడు అర్జున్‌పై కేవలం జూబ్లీహిల్స్‌లోనే కాకుండా, నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యా యని అన్నారు. నిందితులను సమగ్రంగా విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. వీరు ఇంకా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు?, ఈ ముఠాలో ఇంకా ఎవరైనా సభ్యులు ఉన్నారా?, వీరు వసూలు చేసిన సొమ్మును ఏం చేశారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రాజీవ్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి, అర్జున్‌తో కలిపి విచారించే అవకాశం ఉంది.

## ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

**పౌరసరఫరాలో అత్యంత అవినీతి**

**నిజామాబాద్ ఎంపి అర్వింద్ ఆరోపణలు**



హైదరాబాద్,మే2 : కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్ట్‌లనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## పాలమూరు పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

మహబూబ్‌నగర్,మే2 : మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, అధునాతన హంగులతో నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భారీ నిధులు సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతునట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్‌కు కార్పొరేషన్, ముడా ఛైర్మన్లతో కలిసి శంకుస్థాపన చేశారు. నగర సుందరీకరణలో భాగంగా పట్టణంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో పార్కులు, ఓపెన్ జిమ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే మూడా ఆధ్వర్యంలో అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఉన్న మైదానాలకు వేలాది మంది వాకర్స్ వస్తుండటంతో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

**అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి**

**ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ**

హైదరాబాద్,మే2 : హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

## కూకట్‌పల్లిలో విషాద ఘటన

**నవదంపతుల ఆత్మహత్య**

హైదరాబాద్,మే2 : హైదరాబాద్ కూకట్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజుల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయిజన్ తీసుకొన్నట్లు సమాచారం. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవకముందే ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్ లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లాడుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలియదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్తీక్ ఇంట్లో క్లూస్ టీం తో ఆధారాల సేకరిస్తున్నాం.. సూసైడ్ నోట్ లభించలేదని సీఐ శోభన్ తెలిపారు.

## 200 సీట్లలో గెలవబోతున్నాం

**ఎగ్జిట్ పోల్స్ నమ్మబోమన్న మమత**

కోల్‌కతా,మే2 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంనాడు ఆమె మాట్లాడారు. ’200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం’ అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్కెను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు. సీఏపీఎఫ్ దౌర్యనాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు. కాగా, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారంనాడు రీపోలింగ్ జరిగింది. పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ క్రమంలో సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు సైతం చోటుచేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీ బలగాలు మోహరించినా టీఎంసీ గుండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్ట్రాం÷-రగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈనెల 4న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# సంపాదకీయం

## ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనే పరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమీషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# డీలిమిటేషన్ బాటలోనే 'జమిలి' ఎన్నికలు?



భారత రాజకీయ యవనికపై ఇప్పుడు ఒకే ఒక చర్చ.. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు జరుగుతాయా?). అయితే, ఈ లక్ష్యం చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులకు 'డీలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన) రూపంలో పెను సవాలు ఎదురవుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు తరహాలోనే, జమిలి ఎన్నికల బిల్లు కూడా పార్లమెంటులో అవసరమైన మూడింట రెండొంతుల (2/3) మెజార్టీ సాధించలేక 'కమిలిపోయిన ముఖంతోనే' సభలోకి అడుగుపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజ్యాంగం ప్రకారం, ప్రతి జనాభా గణన తర్వాత దేశంలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను జనాభా ప్రాతిపదికన సవరించాలి. అయితే, జనాభా నియంత్రణ పాటించే రాష్ట్రాలు నష్టపోకూడదనే ఉద్దేశంతో 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం, 2001లో వాజపేయి ప్రభుత్వం ఈ ప్రక్రియను 2026 వరకు నిలిపివేశాయి. ఇప్పుడు ఆ గడువు సమీపిస్తుండటం, కొత్త పార్లమెంట్ భవనం (అధిక సీట్ల సామర్థ్యంతో) సిద్ధం కావడంతో ఈ చర్చ వేడెక్కింది. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనపై దేశం రెండుగా విడిపోయింది. కానీ కేంద్రంలో ప్రతిపక్షాలను ఒక్కటి చేసింది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తరాది రాష్ట్రాలు రాజకీయంగా తిరుగులేని ఆధిపత్యం సాధిస్తాయి, అదే సమయంలో జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో తమ గొంతుకను కోల్పోతాయనే ఆందోళన నెలకొంది. ఈ 'ప్రాతినిధ్యపు కోత' భయమే ఇప్పుడు జమిలి ఎన్నికల బిల్లుకు అతిపెద్ద అడ్డంకిగా మారింది. దీనిని ప్రతిపక్షం ప్రధాన పావుగా వాడింది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయంగా గురు-శిష్యులుగా పేరున్న చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి ఈ అంశంపై భిన్నమైన, లోతైన విశ్లేషణలు చేస్తున్నారు: దక్షిణాది రాష్ట్రాలు 'వృద్ధుల ప్రాంతాలు'గా మారకూడదని, జనాభా పెంచాలని పిలుపునిస్తూనే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సీట్లపెంపునకు మద్దతుగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలకోసం చంద్రబాబు నాయుడు పట్టుబడుతున్నారు.మరోవైపు కేవలం జనాభానే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు రాష్ట్రాలు ఇచ్చే వాటా, అభివృద్ధి ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని 'హైబ్రిడ్ మోడల్'ను రేవంత్‌రెడ్డి తెరపైకి తెచ్చారు. పెంచబోయే సీట్లలో 50% జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% ఆర్థికాభివృద్ధి, అక్షరాస్యత వంటి అంశాల ఆధారంగా కేటాయించాలని ఆయనహైబ్రిడ్ మోడల్‌ను సూచిస్తున్నారు. చంద్రబాబు-, రేవంత్‌ల ఆలోచనలు వేరుగా ఉన్నా, దక్షిణాదికి అన్యాయం జరగకూడదనే విషయంలో మాత్రం ఏకాభిప్రాయంతో ఉన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఇతర వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఏ రాష్ట్రానికీ ప్రస్తుతమున్న సీట్ల సంఖ్యను తగ్గించబోమని, అందరికీ సీట్లు పెరుగుతాయని కేంద్రం హామీ ఇచ్చింది (ఉదాహరణకు: 543 సీట్లను 800ం కి పెంచడం). అయితే, సీట్లు పెరిగినా... పార్లమెంట్లో దక్షిణాది ఎంపిల శాతం తగ్గి, ఉత్తరాది ఎంపిల శాతం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వాటా తగ్గింపు లేకుండా ప్రస్తుతమున్న 543 సీట్లను సుమారు 848 లేదా అంతకంటే ఎక్కువకు పెంచాలని ప్రతిపాదన ఉంది. అయితే ఈ ప్రతిపాదనకు పురిట్లోనే సంధి కొట్టినట్లయింది. ఇప్పటికీ దీనికి విన్-విన్ పరిష్కారం ఒకటి ఉంది. జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెంచినప్పటికీ, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 'సీట్ల నిష్పత్తి' తగ్గకుండా చూడటం. అడవికీ, ఆకలికీ మధ్య చిచ్చు అంటే, సభలో దక్షిణాది బలం తగ్గకుండా అదనపు వెయిటేజీ ఇవ్వడం. ఆర్థిక ప్రాతిపదికన వెయిటేజీ కల్పించడం వంటి ప్రతిపాదనలు చేయవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లుగా, కేవలం జనాభానే కాకుండా రాష్ట్రం చెల్లించే పన్నులు తలసరి ఆదాయాన్ని ఒక ప్రాతిపదికగా తీసుకోవడం. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ సహకారం అందించే రాష్ట్రాలకు పార్లమెంట్లో నిర్ణయాత్మక శక్తి ఉండేలా కొన్ని సీట్లను కేటాయించడం. అంతేగాక లోక్‌సభలో జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలకు అన్యాయం జరిగితే, దానిని రాజ్యసభ ద్వారా సరిదిద్దవచ్చు. ఇక్కడ అమెరికా మోడల్‌ను గమనించాల్సిఉంది. అమెరికాలో రాష్ట్రం చిన్నదైనా, పెద్దదైనా సెనెట్లో ప్రతి రాష్ట్రానికి ఇద్దరు సభ్యులే ఉంటారు. అదే విధంగా, భారత రాజ్యసభలో రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పెంచి, కీలక బిల్లుల విషయంలో రాజ్యసభకు మరింత పట్టునివ్వడం ద్వారా చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడవచ్చు. 1971 నుండి ఇప్పటివరకు జనాభా నియంత్రణలో ఏ రాష్ట్రాలైతే ఉత్తమ పనితీరు కనబరిచాయో, ఆ రాష్ట్రాలకు 'అభివృద్ధి బోనస్' కింద అదనపు సీట్లు లేదా ప్రత్యేక నిధులు కేటాయించడం. మరిన్ని కనుగొనండి టెక్ ట్రెండ్స్ కెరీర్ గైడ్ రాష్ట్ర వార్తలు ఒపెక్‌కు 'యుఎఇ' గుడ్‌బై మేలేనా! దీనివల్ల బాధ్యతాయుతంగా ఉన్న రాష్ట్రాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఫలితంగా ఉత్తరాదికి.. జనాభాకు తగ్గట్టుగా సీట్లు పెరుగుతాయి. అభివృద్ధికి అవసరమైన నిధులు అందుతాయి. సంఖ్యాబలం పెరుగుతుంది. అలాగే దక్షిణాదికి.. సీట్ల శాతం తగ్గకుండా 'వెయిటేజీ' లభిస్తుంది. పన్నుల వాటాలో కోత పడకుండా రక్షణ ఉంటుంది. పాలసీ నిర్ణయాల్లో 'వీటో' లేదా సమాన గౌరవం లభిస్తుంది. నియోజకవర్గాల సంఖ్యను పెంచకుండా (సుమారు 543 నుండి 850కి) మహిళలకు 33% రిజర్వేషన్లు ఇస్తే, ప్రస్తుతం ఉన్న పురుష ప్రతినిధుల సంఖ్య తగ్గి రాజకీయ అస్థిరత ఏర్పడుతుందని కేంద్రం భావిస్తోంది. అందుకే డీలిమిటేషన్ ద్వారా సీట్లు పెంచి, అందులో మహిళలకు వాటా ఇవ్వాలని కేంద్రం ప్రతిపాదించింది. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా, ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.2011 లేదా రాబోయే జనాభా గణన ప్రకారం డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అడ్డుకున్నాయి. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో దీనికి 2/3 వంతు మెజార్టీ అవసరం. ఏప్రిల్ 17, 2026న లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అవసరమైన 352 ఓట్లు రాకపోవడంతో (సుమారు 298 ఓట్లు మాత్రమే వచ్చాయి) ఈ కీలక బిల్లు ఆమోదం పొందలేదు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు పరిమితమైన ఈ వైరుధ్య ప్రభావం రానున్నకాలంలో జమిలి ఎన్నికలపై కూడా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2029లో లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని పట్టుదలతో ఉంది. దీనిపై కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ప్రాతిపదికగా తీసుకుంటోంది. దీనికోసం ఆర్టికల్ 83, 172 వంటి వాటికి సవరణలు చేయాలి. దీనికి కూడా పార్లమెంట్లో 2/3 మెజార్టీతోపాటు కనీసం సగం రాష్ట్రాల ఆమోదం అవసరం. 2024 లేదా 2025లో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల కాలపరిమితిని 2029 వరకు కుదించడం లేదా పొడిగించడం ద్వారా అన్ని రాష్ట్రాలను ఒకే గాడిలోకి తీసుకువస్తారు. మొదటి దశలో లోక్‌సభ, అసెంబ్లీలకు.. రెండో దశలో (100 రోజుల వ్యవధిలో) స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ప్లాన్ ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 (పార్లమెంట్ పదవీకాలం), ఆర్టికల్ 172 (అసెంబ్లీల పదవీకాలం) వంటి కీలక అంశాలను సవరించాలంటే 2/3 మెజార్టీ (సుమారు 362 ఓట్లు) తప్పనిసరి. ఏప్రిల్ 2026లో మహిళా రిజర్వేషన్/ డీలిమిటేషన్ బిల్లు సమయంలో ప్రభుత్వానికి సుమారు 292- 300 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా 60- 70 ఓట్ల దూరం ఉంది. రాజ్యసభలో కూడా విపక్ష కూటమి బలంగా ఉంది. అక్కడ కూడా 2/3 మెజార్టీ సాధించడం చీణాకి ప్రస్తుతానికి కష్టమే. జమిలి ఎన్నికల బిల్లు కేవలం పార్లమెంట్‌లో ఆమోదం పొందితే సరిపోదు. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తి ప్రకారం కనీసం 50% రాష్ట్రాల అసెంబ్లీలు (అంటే 15 రాష్ట్రాలు) ఈ బిల్లును ఆమోదించాలి.

## అర్ధరాత్ర యువకుడిపై దాడి

**ప్రాణాలు పోయేలా కొట్టి పడేసిన దుండగులు**

**ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో యువకుడికి చికిత్స**

వనపర్తి,మే2 : వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన జరిగింది. శివ (27 ) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముందు వదిలి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

**ఐపిఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్ ముఠాల ఆటకట్టు**

హైదరాబాద్,మే2 : ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి స్కామ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏప్రిల్ నెలలోనే 184 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తొలగించగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో 801 ఫేక్ యాడ్స్‌ను గుర్తించారు. అమాయకులను టార్గెట్ చేసి వారిని బెట్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌ల వైపు మళ్లించే ప్రొఫైల్స్‌పై పోలీసులు ఉక్కుపాదం.


## ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

**బిఆర్‌ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్**

హైదరాబాద్,మే2 : ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్మాదనం చెప్పకుండా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. . ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారంహైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు.

## అనఘుని అఘమోక్షణ లీల

'దూడల దండులో దూరిన ఏకు వంటి లేత దంభం కల వత్సా(దూడ)సురుని వధించి శౌరి- కృష్ణుడు, మరోసారి ముని మానస బృందంలోనికి చొచ్చుకు వచ్చిన పెచ్చురిల్లిన-మేకు వలె ముదిరిన, దంభం కల బకాసురుని అసువు(ప్రాణా)లను హరించాడు.'- ఇది వ్యాఖ్యాతృ చక్రవర్తి శ్రీధరాచార్యుల శ్రీముఖం! 'ఏకు మేకయింది, మొక్కగా వంగనిది మానై వంగుతుందా?' అనే సామెతల ఆసాములే వత్సాసుర బకాసురులు. శ్రీశుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా! బలరామాది గోపబాలురందరూ చిన్నారి కన్నయ్యతో కూడి దూడల మందలను మళ్లించుకొంటూ తిన్న-తిన్నగా బృందావనంలోని తమ తమ వాడ(వీధు)లకు చేరుకున్నారు. అసురవధను గురించిన కథను వారి ద్వారా విని బృందావని వాసులు నివ్వెరపోయి ఇలా తలపోశారు. ఈ బుడతనిపై కడు ఆపదలు వచ్చిపడుతూ వడి-వడిగానే విచ్చి- సమసి పోతున్నాయి. పసివాడే కదా అని వీని మీద కసితో విరుచుకుపడ్డ ఖలులు- దుష్టులందరూ మంటల్లో ఎగసి (గర్వించి) పడే మిడుతల వలె పస (సారం, సమృద్ధి) చెడి నశిస్తున్నారు. పొద్దునే లేచి చద్ది అన్నపు కావడులను, పిండివంటల మూటలను ఒద్దికగా భుజాలకు తగిలించుకొని సందడి చేస్తూ దూడలతో అడవిలో ప్రవేశించారు. కేరింతలు కొడుతూ, కుప్పించి దూకుతూ తమ నీడలను చూసి నవ్వుకుంటూ, పరుగెత్తుతూ, కలసిమెలసి పకపకలతో ఎకసెక్కెము (పరిహాసము) లాడుతూ పలు రకాల ఆటలు ఆడుకొంటున్నారు. నందనందనుడు కొద్దిగా ముందుకు వెళ్లినప్పుడల్లా వల్లవ కుమారులందరూ పోటీపడి మరీ పరిగెత్తుతూ వెళ్లి యదువల్లభుని తాకి- తాకి అలౌకికమైన ఆనందాన్ని పొందేవారట! సుఖేన బ్రహ్మ సంస్పర్శం అత్యంతం సుఖమశ్నుతే'- అన్న గీతావాక్యం అపురూపంగా రూపుదాల్చింది. 'ఒక్క పరమాత్మ విషయంలో తప్ప ఈ ప్రపంచంలో మరి దేని కొరకూ 'నేను-నేను' అంటూ మేనును- శరీరాన్ని మోసుకుంటూ ముందుకు తోసుకు రాకూడదు'- అని ఈ లీలా పరమార్థం.



ఆధ్యాత్మికం

# సఫాయి కార్మికుల సేవలు వెలకట్టలేనివి

**● కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ● మున్సిపల్ కార్మికులకు టవల్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ**

**కరీంనగర్ టౌన్, మే2(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ 42వ డివిజన్ భగత్ నగర్ లో సీనియర్ సిటిజన్స్ కేర్ సెంటర్, జెడ్ పీ కోటర్స్ లో యోగా ట్రైనర్ మర్రి రాజేందర్ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు వేసవికాలం దృష్టిలో పెట్టుకొని టవల్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ,సీనియర్ సిటిజన్స్ కేర్ సెంటర్ బాధ్యులు వి.మోహన్ రెడ్డి, కేశవ రెడ్డి, అంజన్న, సత్తన్న, లింగన్న, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారుఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు" మన ఊరు సుందరంగా ఉండాలన్నా, పరిశు భ్రంగా ఉండాలన్నా దానికి కారణం మన మున్సిపల్ కార్మికులే. వారు ఒక రెండు మూడు రోజులు పని చేయకపోయినా మనం ఇంటి నుండి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. మనం గతంలో చూసాము కూడా. కానీ వారు ఎప్పుడూ అలా జరగాలని కోరుకోరు. వారికి ఎన్ని బాధలున్నా ఉదయం 4 గంటలకే ఇంటి నుండి బయలుదేరి 5 గంటలకు అటెండెన్స్ ఇచ్చి, చీకటిలోనే అనేక ప్రమాదాలకు ఎదుర్కొని పనులు చేస్తారు. రోడ్డు ప్రమాదాలు కావొచ్చు, వీధి కుక్కలు కావొచ్చు ఎన్నో ఇబ్బందులు ఉన్నా కూడా వాటిని తట్టుకొని మనకు మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారు మన మున్సిపల్ కార్మికులు మన ఇంట్లో ఒక రోజు చెత్త తీయకపోయినా వచ్చే వాసనను మనం భరించలేము. అటువంటిది వారు సమాజంలోని చెత్తనంతా తొలగిస్తూ, అనారోగ్య పాలవుతూ కూడా మనకు సేవ చేస్తున్నారు. వారికి ఎంత చేసినా తక్కువే అని మేము భావిస్తున్నాము. అందుకే గతంలో మా పాలకవర్గం ఉన్న సమయంలో, మనుషులు డ్రైనేజీలలోకి దిగకూడదనే ఉద్దేశంతో అధునాతన మెషినరీని తీసుకువచ్చాము. దీనివల్ల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చి 'సఫాయి మిత్ర సురక్ష ఛాలెంజ్'లో 4 కోట్ల రూపాయల నగదు బహుమతిని గెలుచుకోవడం జరిగింది. భారతదేశంలో కరీంనగర్ కు రెండో స్థానం దక్కింది.మున్సిపల్ కార్మికుల కష్టానికి ప్రస్తుతం ఇస్తున్న 16 వేల రూపాయల వేతనం చాలా తక్కువ దానిని కనీసం 25 వేల రూపాయలకు పెంచాలని నిన్న మే డే సందర్భంగా జిల్లా కలెక్టర్ గారిని కోరడం జరిగింది. చుట్టుపక్కల ఏదైనా పంది లేదా కుక్క చనిపోతే వచ్చే వాసనకే మనం కార్పొరేటర్లకు ఎన్నో సార్లు ఫోన్ చేస్తాము. అటువంటి దుర్వాసనను భరిస్తూ గంటల తరబడి పనిచేసి మనకు ఆరోగ్యకరమైన సమాజాన్ని ఇస్తున్న సఫాయి కార్మికులకు హృదయపూర్వక నమస్కారాలు. మీరు, మీ కుటుంబాలు, మీ పిల్లలు అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను.సఫాయి కార్మికుల పట్ల సమాజంలోని అన్ని వర్గాల వారు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఎంతో ఎండలో కూడా మీరు చేస్తున్న పనిని గుర్తించి, మంచి నీళ్ల సీసా, టవల్ అందించేందుకు ముందుకు వచ్చిన రాజేందర్ అన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా సఫాయి కార్మికులందరికీ 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. అంతేకాకుండా, కార్మికుల ఆరోగ్య బీమా గురించి కూడా నగరపాలక సంస్థ ఆలోచిస్తోంది. గతంలో 60 ఏళ్లు దాటితే మానవత్వం లేకుండా కార్మికులను తొలగించే పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు ఆ నిబంధన మార్చి, అనారోగ్య కారణాల వల్ల ఇబ్బంది ఎదురైనా వారి కుటుంబ సభ్యులకు ఆ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగ భద్రత ఉన్నప్పటికీ, తగినంత జీతాలు లేవని మాకు తెలుసు. కార్మికుల జీతాలు పెంచేందుకు మా పాలక వర్గం ఖచ్చితంగా కృషి చేస్తుంది. నగరం శుభ్రంగా ఉండటానికి మీరు చేస్తున్న కృషికి నగర ప్రజలందరి పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు.





# పేదలకు సేవ చేసినప్పుడే నిజమైన సంతృప్తి పొందుతాం

**● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**తిమ్మాపూర్,మే2(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్ లో శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సభను నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రచారాల ద్వారా అవగాహన కల్పించడం వల్లే పోలియో వ్యాధిని సమర్థవంతంగా నివారించగలిగామని గుర్తు చేస్తూ అదేవిధంగా పథకాలపై కూడా అవగాహన కల్పిస్తే ప్రజలు ప్రయోజనం పొందగలుగుతారన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజులపాటు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సభలు నిర్వహిస్తున్నామని, గత బీఆర్ఎస్ పథకాల అమలులో విఫలమైందని, ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యం, గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించగా మానకొండూర్ లో 50 పడకల ఆస్పత్రిని త్వరలో అందుబాటులోకి రానున్నదని, మండల్లోని ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలల సమస్యలను తెలుసుకుంటూ మౌలిక సదుపాయాలు సమకూరు స్తున్నామన్నారు. తిమ్మాపూర్ మండలం యాదవులపల్లిలో 200 కోట్లతో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా వ్యవసాయ కళాశాలను కూడా నియోజవకవర్గానికి మంజూరు చేయించు కోగలిగామంటూ పేదలకు సేవలు చేసినప్పుడే నిజమైన సంతృప్తిని పొందగలుగుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమం విజయవంతం కాదని, ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో నిర్వహించే గ్రామ సభల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంచాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తోపాటు ఇతర పథకాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుండగా త్వరలో మరికొన్ని పథకాలు అమలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి ఇంటర్మీడియెట్ స్థాయి వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నదని, వరి సాగుపైననే కాక ప్రత్యామ్నయ పంటలపై దృష్టి సారించాలని సూచిస్తూ ఒకే రకమైన పంటతో భూసారం దెబ్బతింటుందని పంటల మార్పిడి చేపట్టాలని కోరుతూ నూనె గింజల సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండలానికి చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కొత్తపల్లి సర్పంచ్ గోదారి శోభారాణి, నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంద్యా రావు,జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ సిఈఓ పవన్, డిడబ్ల్యూడబ్ల్యూఓ సరస్వతి, డిఏఓ భాగ్యలక్ష్మి, తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, సురేఖ, కనకయ్య, శ్రీకాంత్, సురేష్, ఎంపీడీవోలు మల్హోత్ర, వి.వి.వరలక్ష్మి, కృష్ణప్రసాద్, కె.ప్రవీణ్, క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, ట్రాన్స్ కో ఏఈ ఖాసీం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్ గౌడ్, గోపగోని బస్వయ్యగౌడ్, ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణతోపాటు వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# సెన్సస్ 2027 విజయవంతానికి సమన్వయంతో ముందుకు సాగాలి

**● స్వీయ గణనపై స్పందన తక్కువ - 4 రోజుల్లో 50 వేల నమోదు లక్ష్యం ● ప్రతి గ్రామం, వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలి**

**● ప్రభుత్వ సిబ్బంది, సంస్థల ఉద్యోగులు 100% స్వీయ గణన పూర్తి చేయాలి ● స్వీయ గణన 2027 పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో సెన్సస్ 2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జె. అరుణ శ్రీ, డీసీపీ రామ్ రెడ్డి తో కలిసి సెన్సస్ 2027 పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్నామని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికీ ఇప్పుడు 16వ జనగణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధ ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలు ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తామని తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, ఆహార ధాన్యాల వినియోగం వంటి అంశాలను నమోదు చేస్తారని తెలిపారు.జిల్లాలో మొత్తం 1548 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించగా, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 మంది జనాభా ఉంటుందని పేర్కొన్నారు.రెండో దశగా 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో జనాభా గణన నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని, డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని, వెబ్‌సైట్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం 11 అంకెల ప్రత్యేక నంబర్ వస్తుందని, ఆ నంబర్‌ను ఎన్యుమరేటర్‌కు ఇవ్వాలని సూచించారు. తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు.ఇప్పటివరకు స్వీయ గణనపై స్పందన చాలా తక్కువగా ఉందని, సుమారు 10 వేల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ కేవలం 1500 నమోదులు మాత్రమే జరిగాయని తెలిపారు. ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఉద్యోగులు తక్షణమే స్వీయ గణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీపీసీ, కేశోరం, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థలలో 100 శాతం స్వీయ గణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.గ్రామ స్థాయిలో ఎంపీడీవోలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ సిబ్బంది స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం 100 కుటుంబాలు, మున్సిపాలిటీల్లో ప్రతి వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సివిల్ సప్లైస్ అధికారులు రేషన్ డీలర్ల ద్వారా, డీఆర్‌డీఓ అధికారులు స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి సంఘంలో కనీసం 3 మంది నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ఫీల్డ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించి కనీసం 15 మంది నమోదు చేయించాలని సూచించారు. కాలేజీ విద్యార్థులు కూడా స్వీయ గణనలో పాల్గొనేలా చైతన్యం కల్పించాలని కోరారు. వచ్చే 4 పని దినాల్లో 50 వేల స్వీయ గణన నమోదు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.





# రంగపేటలో కుక్కల దాడి 15 గొర్రెలు మృతి

**గొర్రెల కాపరులకు అఖిల భారత యాదవ మహాసభ బాసట**






**కరీంనగర్ టౌన్, మే 2(ది క్రైమ్ న్యూస్):** మనకొండూరు మండలం రంగపేట గ్రామంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 15 గొర్రెలు మృతి చెందగా, మరో 5 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనతో పేద రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు బాధితుడిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సందబోయిన ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న రైతులు ఇలాంటి దాడుల వల్ల వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రసాద్ యాదవ్ డిమాండ్లు చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతుకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి.గొర్రెల ఇన్సూరెన్స్ ప్రక్రియను మరింత సరళతరం చేసి, ఇలాంటి సమయాల్లో రైతులకు అండగా నిలవాలి.జంతువుల దాడుల నుండి జీవాలను రక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ట్రస్ట్ చైర్మన్ బబ్బురి కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లేశం యాదవ్, ఉప సర్పంచ్ కొమురయ్య యాదవ్, నాయకులు ముక్కెర కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లకు జీతాలివ్వలేని దుస్థితిలో కాంగ్రెస్....!
## ఇగ ఆళ్ళకిచ్చిన 18వేల హామీ నెరవేర్చేదెప్పుడో....?

**- మాజీ ఎమ్మెల్యే రసమయి**



**బెజ్జంకి, మే2(ది క్రైం న్యూస్):** రాష్ట్రంలో అంగన్వాడి టీచర్లకు జీతాలివ్వకుండా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందోనంటూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం ఒక ప్రకనను విడుదల చేశారు.గత రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇళ్ళు గడవక అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో అంగన్వాడి టీచర్లకు ఇస్తానన్న 18వేల హామీ ఇవ్వకపోగా గతం నుండి వచ్చే 13,650 జీతాన్ని కూడా సరిగ్గా ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు.అంగన్వాడిలకు జీతాలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నిస్తూ వాళ్ళ ఇబ్బందులు తొలగేలా తక్షణమే అంగన్వాడీల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రసమయి ప్రకటనలో పేర్కొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున స్వామి




**జమ్మికుంట మే 2 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన కమిషనర్ ల బదిలలో శనివారం నూతనంగా బదిలీపై వచ్చిన గుట్టల మల్లికార్జున స్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, టిపిబివో దీపిక, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సమ్మి గౌడ్ చిలువేరు

**- వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు బహుకరించిన సమ్మయ్య గౌడ్**



**కేసముద్రం, (ది క్రైమ్ న్యూస్):** కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామం చంద్రుతండాకు చెందిన బానోత్ కైక- బిక్ష(లేటు) ల కుమారుడు గణేష్ వివాహం వధువు ప్రవంతితో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని వధూవరులకు నూతన పట్టు వస్త్రాలు అందజేసి అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ వెంట భూక్య శ్రీనివాస్ నాయక్, బానోత్ అశోక్ నాయక్,లకావత్ మనోజ్ కుమార్,మాలోత్ భాస్కర్,భానోత్ రాజు, గూగుల్ లింగా, భూక్య భాస్కర్, చంద్రుతండా యువత తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అగ్రస్థానంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

**● సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా ముందంజ ● మే 6న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి ● ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ● బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్**





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా ముందంజలో ఉందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలంలోని బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రామ్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి 4 అవార్డులు సాధించిందని, ఓపీ సంఖ్య 280 నుండి 900కు, ప్రసవాలు 40 నుండి 250కు పెరిగినట్లు పేర్కొన్నారు. కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఎంఆర్ స్కాన్, సీటీ స్కాన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పెద్దపల్లి ఆసుపత్రికి వస్తున్నారని చెప్పారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్, కార్డియాలజీ, 2డి ఎకో వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వడ్డీరహిత రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి కోతలు లేకుండా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలని, వరి, మొక్కజొన్నలతో పాటు ఇతర పంటలను కూడా పండించాలని సూచించారు.
మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతులకు మద్దతు ఇస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ జ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి వడ్డీరహిత రుణాలు, రేషన్‌లో సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల



నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ప్రతి సోమవారం పురోగతికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. మే 6న వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, సుమారు 100 కంపెనీలు పాల్గొని 2 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలుపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ప్రస్తుతం కొనుగోలు వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. వేడి తీవ్రత కారణంగా హమాలి సమస్యలు ఉన్నప్పటికీ రైతులు సహకరించాలని, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. డీజిల్, పెట్రోల్ కొరతపై వస్తున్న వదంతులు అసత్యమని, జిల్లాలో తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ స్టాక్‌లను పర్యవేక్షిస్తూ, ప్రతి పెట్రోల్ బంక్‌పై నిఘా ఉంచినట్లు చెప్పారు. ప్రజలు అవసరానికి సరిపడా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లా రెడ్డి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఆర్డీఓ బి. గంగయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల నుండి మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు

**● మూడు చెరువులకు మాత్రమే అనుమతులు ● మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్‌ఓసీలు ● ప్రతి వాహనానికి ఫోటోగ్రఫీ, రసీదు తప్పనిసరి ● అధిక లోడుతో రవాణా నిషేధం ● అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు ● మానేరువాగు పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఇటుక బట్టీలకు చెరువుల నుండి మట్టి (గ్రావెల్) రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మట్టి (గ్రావెల్), ఇసుక రవాణాపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నీటి మట్టం తక్కువగా ఉన్న చెరువుల నుండి మట్టి తవ్వకాలకు గత సంవత్సరం సెస్ వసూలు చేసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విధానాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం కొదురుపాక చెరువు, రాయకుంట చెరువు, ముత్తారం చెరువుల నుండి మట్టి రవాణా కోసం 15 ఇటుక బట్టీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలో ఈ మూడు చెరువులకు మాత్రమే అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. నీరు లేని చెరువులను మాత్రమే మట్టి తవ్వకాలకు పరిగణనలోకి తీసుకుని, సాగునీటి శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్‌ఓసీలు మంజూరు చేయాలని ఆదేశించారు. మట్టి రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వాహన రవాణాను ఫోటోగ్రఫీ చేయాలని, ప్రతి వాహనానికి రసీదు జారీ చేయాలని తెలిపారు. వాహనాలు అధిక లోడుతో రవాణా చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి



పరిస్థితుల్లోనూ అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మానేరువాగు పరిధిలో పెద్దపల్లి వైపు ఎలాంటి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని, కరీంనగర్ వైపు జరుగుతున్న తవ్వకాల నేపథ్యంలో అక్కడి జేసీబీలు పెద్దపల్లి వైపు రాకుండా కఠినంగా హెచ్చరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జేసీబీలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఈ అంశంపై జేసీబీ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గనుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రతి రైతు గింజకు సర్పంచ్ సరోజన రమేష్ భరోసా

**- వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**





**మంథని (ది క్రైమ్ న్యూస్):** సబ్బితం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ విజ్జన్న ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ నూనె సరోజన రమేష్ మాట్లాడుతూ, రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ధాన్యం సేకరణలో ఎలాంటి కట్టింగ్‌లు లేకుండా పారదర్శకంగా కొనుగోలు నిర్వహిస్తామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే రైతు భరోసా నిధులు కూడా విడతల వారీగా విడుదల అవుతాయని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. రైస్ మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్, పాలకవర్గ సభ్యులు, సొసైటీ బాధ్యులు సతీష్, సెంటర్ ఇంచార్జ్ కిష్టయ్య, మాజీ సర్పంచ్ సదయ్య, సామాజిక సేవకులు ఊదరి లక్ష్మణ్ పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఖూలాలు, గ్రామ పెద్దలు, హమాలీలు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అయ్యా ముఖ్యమంత్రి మా సొమ్మును మాకివ్వండి



**తిమ్మాపూర్, మే2(ది క్రైం న్యూస్):** తమ భవిష్యత్తు అవసరాలకోసం దాచుకున్న జిపిఎఫ్, జిఐఎస్ డబ్బులను తమకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఎం.శంకరమ్మ శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. కుటుంబంతో పాటు విద్యార్థులే తమ దేవుళ్ళుగా భావించి వాళ్ళను భావిపౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించడంలో తమ మనసు,శరీరాన్ని సమాజానికి అంకితమిచ్చామని శంకరమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యోగుల హక్కులను కాలరాయకుండా ఉపాధ్యాయుల సేవలను గుర్తించి జిపిఎఫ్, జిఐఎస్ లో దాచుకున్న తమ సొమ్మును మానవతా దృక్పదంతో తక్షణమే అందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రకటన ద్వారా శంకరమ్మ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా కిసాన్ సెల్ మండలాధ్యక్షుడి పుట్టినరోజు వేడుక



**మానకొండూర్,మే2(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బుర్ర శ్రీకాంత్ గౌడ్ పుట్టినరోజు వేడుకను కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ కు నాయకులు శాలువాలు కప్పి కేకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి,మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, సర్పంచులు బుర్ర శ్రీధర్ ,మీస సత్యనారాయణ, రామడుగు హరీష్, నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ధ్యావ శ్రీనివాసరెడ్డి, బండి మల్లేశం, కొండ్ర సురేష్,రమణ ,ఎనిగంటి శ్రీకాంత్, కనకం రాకేష్, బందల మహేందర్, తదితరులు పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజల ఆరోగ్యమే మా బాధ్యత

**వన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి**

**పిట్టల ఎల్లయ్య పల్లెలో ఉచిత మెగా వైద్య శిబిరం....**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజల ఆరోగ్యమే తమ ప్రథమ బాధ్యత అని,ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని కరీంనగర్ వన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో వన్ హాస్పిటల్ బృందం,గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్,గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సరైన వైద్య వసతులు లేక ఇబ్బందులు పడుతున్న సామాన్యుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటూ ఇలాంటి సువర్ణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచితంగా జనరల్ మరియు స్పెషలిస్ట్ పరీక్షలు నిర్వహించి,రోగులకు అవసరమైన ప్రాథమిక మందులను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా నిత్య జీవితంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత,గాయకులు పొద్దుపొడుపు శంకర్, సర్పంచ్ రవికుమార్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,వన్ హాస్పిటల్ వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

# అశేష జనవాహిని మధ్య "ఈనాడు" రాజ్ కుమార్ అంతిమయాత్ర




**తిమ్మాపూర్, మే2(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో జర్నలిస్టుగా సేవలందిస్తున్న బొజ్జ రాజ్ కుమార్ అకాల మరణం అందరిని కలిచివేయగా శనివారం స్వగ్రామం పోరండ్లలో జరిగిన తన అంతిమయాత్ర కన్నీటి వీడ్కోలుతో కొనసాగింది. రాజ్ కుమార్‌ను చివరి చూపు చూసేందుకు వేలాది మంది తరలివచ్చి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి ఒక్కరూ కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. "ఈనాడు" మండల విలేకరిగా తన మంచితనంతో అందరి మనసులు గెలుచుకున్న రాజు కుమార్ అకస్మాత్తుగా మృతిచెందడం గ్రామస్తులతో పాటు సహచర జర్నలిస్టులను తీవ్ర శోకసంద్రంలో ముంచింది. సహచర జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, స్నేహితులు, బంధువులు, మహిళలు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొని తమ నివాళులర్పించారు. ఇద్దరు పిల్లలున్న రాజ్ కుమార్ కుటుంబ పరిస్థితి చూసి అక్కడున్న వారంతా కంటతడి పెట్టుకోగా రాజ్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి గ్రామస్తులు తమ గౌరవాన్ని చాటుకున్నారు. రాజ్ కుమార్ మృతిపట్ల చలించిపోయిన బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేష్ జర్నలిస్టుగా మంచి వ్యక్తిగా అందరితో కలివిడిగా ఉండేవాడని రాజ్ కుమార్ మరణం తీవ్రంగా కలిచివేసిందని సంతాపం వ్యక్తం చేస్తూ అంతిమయాత్ర ఖర్చులకు ఇరవై వేల రూపాయలు అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.

## విలేకరి కుటుంబానికి జీవిఆర్, కేతిరెడ్డి పరామర్శ



**తిమ్మాపూర్, మే2(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లలో బలవన్మరణానికి పాల్పడి మృతి చెందిన విలేకరి బొజ్జ రాజ్ కుమార్ కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి పరామర్శించారు. ఒక మంచి విలేకరిని మండలం కోల్పోయిందని, ఈ విషాదం నుండి కోలుకుని, అన్ని విధాలుగా తట్టుకునే శక్తిని భగవంతుడు ఆ కుటుంబానికి ఇవ్వాలని కోరుతూ తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పాశం అశోక్ రెడ్డి,ఉపసర్పంచ్ నీలం ఓదెలు, నాయకులు తదితరులు పరామర్శలో జీవి వెంట ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యం

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మయూరి నగర్, లక్ష్మీ నగర్ కాలనీలలో రూ.1 కోటి 49 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశుధ్య పరిస్థితులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఓపెన్ జిమ్‌లు వంటి పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని కాలనీల్లో థీమ్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అభివృద్ధి పనులలో భాగంగా మయూరి నగర్‌లో రూ.1.26 కోట్లతో సీసీ రోడ్లు, లక్ష్మీ నగర్‌లో రూ.23 లక్షలతో వరద నీటి కాల్వ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతాం

**● సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాల కల్పన కోసమే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**







**ధర్మపురి, మే 2, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మపురి నియోజకవర్గస్థాయి సమావేశం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. ఇందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చని పథకాలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా నియోజకవర్గా అభివృద్ధికి కృషి చేస్తున్నమని మంత్రి తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సుమారు 450 కోట్ల అంచనాలతో ధర్మపురిలో పుష్కర ఘాట్లు ఇతర మౌలిక సదుపాయాల కోసం అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని మంత్రి తెలిపారు. తొలి విడత టైర్ వన్ ద్వారా రూ. 115 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో పాటు ధర్మపురికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయించామని మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ధర్మపురి నియోజకవర్గ విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు పొందాలని మంత్రి సూచించారు.గడిచిన రెండున్నర ఏళ్ల ప్రజా పాలనలో ధర్మపురి నియోజకవర్గంలోని 474 రైతులకు రైతు బీమా పథకం ద్వారా రూ. 18 కోట్ల 7లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకంలో 1,21,851 మంది రైతులకు రూ 188 కోట్ల 48 లక్షలు అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని 21, 917 మంది రైతులకు రూ.161 కోట్ల 82 లక్షల రుణమాఫీ చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన వ్యవసాయ యాంత్రీకరణను తిరిగి ప్రారంభించిన ప్రభుత్వం ధర్మపురి నియోజకవర్గాల్లోని 124 మంది రైతులకు 54 లక్షల 35 వేల విలువైన వ్యవసాయ యంత్రాలను అందజేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3104 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసి 139 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వివరించారు. గృహజ్యోతి పథకంలో 49వేల 444 మంది లబ్ధిదారులకు 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. చేయూత పెన్షన్ పథకం ధర 49 వేల 299 మంది లబ్ధిదారులకు 10 కోట్ల 97 లక్షల రూపాయలను జమ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంలో 2862 మందికి పదికోట్ల 91 లక్షలు రూపాయలు అందించినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 15,835 మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని మంత్రి వివరించారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు పండించిన దాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మక్కజొన్న రైతులకు మద్దతు ధర చెల్లించడానికి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం ధర్మపురి టెంపుల్ మాస్టర్ ప్లాన్ పై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ ఫైనల్ అయినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. అశీదుకు సంబంధించిన డ్రాయింగ్స్ పూర్తి కావడంతో త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధర్మపురి టెంపుల్ సిటీ మాస్టర్ ప్లాన్ పనులను ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగవైకల్యాలు రాకుండా ఇప్పటికే పరీక్షలు నిర్వహించామని జగిత్యాల జిల్లాలో ఆర్బీ ఎస్కే ద్వారా చిన్నారులకు వైద్యం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ధర్మపురి లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ధర్మపురి నియోజక వర్గంలోని పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలతో చేపట్టిన స్వచ్ఛ గోదావరికి మంచి స్పందన లభిస్తుందని నాగలక్ష్మి తెలిపారు. మంత్రి సలహాలు సూచనలతో ముందుకు సాగుతూ ధర్మపురి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దు తామని మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో పాటు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నంది అవార్డుకు జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ ఎంపిక

**- సంచలనాత్మక కథనాలకు కేరాఫ్.. - నాడు డాక్టరేట్.. నేడు నంది అవార్డు.. - వెల్లువెత్తుతున్న అభినందనలు..**





**ఖమ్మం, ప్రతినిధి, మే 2, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బండి కుమార్ ఆనందో బ్రహ్మ స్వర్ణనంది పురస్కారం అవార్డుకి ఎంపికయ్యారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ గత 12 సంవత్సరాలుగా వివిధ ఛానెల్స్, పత్రికల్లో, వివిధ హెదాల్లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారు. అనేక అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ప్రజా సమస్యలను వెలికి తీస్తూ ప్రభుత్వాల ద్వారా వాటిని పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈవిధంగా సమాజానికి సేవచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్నందుకు అతని సేవలను గుర్తించి ఈ నెల మే 3వ తేదీన ఆదివారం రోజున హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ లో జరిగే ఆనందో బ్రహ్మ స్వర్ణ నంది పురస్కారం కార్యక్రమంలో మాజీ కార్మిక శాఖ మంత్రి, ప్రముఖ హాస్యనటుడు, డాక్టర్ పల్లి బాబు మోహన్, తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ చేతుల మీదుగా ప్రధానం చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బండి కుమార్ "పీపుల్స్ డైరీ" దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక సంచలనాత్మక కథనాలను అందించారు. ఎక్కడ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా ఎలాంటి శక్తుల ఒత్తిళ్లకు లొంగకుండా నిర్భయంగా వార్తలు అందించడంలో దిట్ట... జర్నలిజం వృత్తినే శ్వాసగా... నైతిక విలువలను పాటిస్తూ పేదల పక్షాన నిలువడం, అన్యాయాన్ని ఎదురించడం లక్షణం.. అక్రమార్కుల బెదిరింపులకు వెరువకుండా, అక్రమ కేసులకు సైతం భయపడకుండా ఎంచుకున్న దారిలో దూసుకెళ్తూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. నంది అవార్డు రావడం పట్ల స్థానిక సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలుపుతూ డాక్టర్ బండి కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలి...

**● ఐక్య పోరాట అఖిలపక్ష కమిటీ డిమాండ్**



**హుజురాబాద్ మే 2 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ పట్టణానికి సిర్సపల్లి గ్రామ శివారుకు మధ్యలో ప్రతిపాదించిన వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టు రద్దు కొరకు వేస్ట్ టు ఎనర్జీ వ్యతిరేక ఐక్య పోరాట అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గత నెల రోజులకు పైగా కొనసాగుతున్న నిరసన దీక్ష కార్యక్రమంలో భాగంగా ఈరోజు పద్మశాలి సంఘం హుజురాబాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చందుపట్ల జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించినారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న పోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ వేస్ట్ టు ఎనర్జీ డంపింగ్ ప్రాజెక్ట్ నిర్మాణం వలన చెత్త నుండి వెలువడు రసాయనాలు భూమిలో ఇంకిపోవడం మూలంగా హుజురాబాద్ పరిసర ప్రాంతాల భూమిలోని నీరు కలుషితమై ఎలాంటి పంటలు పండక పోవడమే కాకుండా కలుషిత నీరు త్రాగడం వలన ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురి అవుతారని ఆవేదనను వ్యక్తం చేసినారు అదే విధంగా వేస్ట్ టు ఎనర్జీలో భాగంగా ఎనర్జీని ఉత్పత్తి చేయుటకు చెత్త పదార్థములను కాల్చడం వలన వచ్చేటువంటి డయాక్సిన్ వంటి విషవాయులు గాలిని కలుషితం చేయడం జరుగుతుందని ఫలితంగా ఇక్కడి ప్రజలు లంగ్స్ క్యాన్సర్‌తో పాటు మలేరియా టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు లోను అవ్వడమే కాకుండా దగ్గ జలుబు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో తీవ్ర అనారోగ్యానికి గురి కావలసి వస్తుందని తమ ఆందోళన వ్యక్తం చేసినారు ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ఏ మాత్రము ఏమరు పాటు లేకుండా తొందరగా మేల్కొని ఐకమత్యంతో ముందుకు కదిలి ఈ సమస్యను గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును రద్దు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత వారిపై ఉందని డిమాండ్ చేసినారు కార్యక్రమంలో వేముల యాదగిరి విడపు రాజు చిలుక మారి శ్రీనివాస్ సబ్బని రాజేందర్ మంచి కట్ల మురళి ఎం రమేష్ ఈ చంద్రశేఖర్ ఎస్ సత్యనారాయణ ఎమ్ బిక్షపతి ఈ సాగర్ ఎం వెంకట్రాజం ఈ వెంకటేశ్వర్లు టి దేవేందర్ ఎం విజయ్ ఎం రమేష్ టి సంపత్ కుమార్ ఎం వెంకటేశ్వర్లు కే ప్రభాకర్ కే రామచంద్రం జేఏసీ నాయకులు గుడిపాటి జయపాల్ రెడ్డి వీ రత్నం సందేల వెంకన్న మార్త రవీందర్ వెంకట్రావు టి హనుమంతరావు రాజేశ్వరరావు తదితరులతో పాటు చేనేత కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో ప్రజా సమస్యల పరిష్కారం





**కరీంనగర్ టౌన్,మే2(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ"లో భాగంగా శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథులు గా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలను అధికారులు వివరించారు. మేయర్, కలెక్టర్, ఇతర అతిథుల చేతుల మీదుగా రైతు భీమా, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మెప్మా పరిధిలోని 38 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.5.46 కోట్ల బ్యాంకు రుణాల చెక్కును అందజేశారు. ముఖ్యంగా 'వారహీ ట్రాన్స్ జెండర్ గ్రూప్'కు పాస్ బుక్ అందజేయడం విశేషం.డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన' అభినందనీయమని, అయితే క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. నిధుల కొరత వల్ల ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికార యంత్రాంగం నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాలని సూచించారు. పార్టీలకు అతీతంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు, పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల ఉన్న తాధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి


**- రైతు వేదికల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి - ప్రత్యామ్నాయ సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేర వేయాలి - వ్యవసాయ వారోత్సవాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మే 4 నుంచి 9 వరకు నిర్వహించే వ్యవసాయ వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 4 నుంచి మే 9 వరకు వ్యవసాయ వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మే 4న జిల్లాలోని ప్రతి రైతు వేదికలో రైతులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రైతు వేదికల్లో సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగం, మట్టిపరీక్షలు, వివిధ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మట్టి సారం పెంపు కోసం మట్టిపరీక్షల ఆధారంగా సరైన సమయం సరైన పరిమాణంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, అధిక ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని సూచించారు.మే 5న ఉద్యానవన పంటల ప్రోత్సాహం, ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సుమారు 3 లక్షల ఎకరాల సాగును 12 లక్షల ఎకరాలకు విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.సహకార సంఘాలు, మార్కెటింగ్ కమిటీలు రైతులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్ నిల్వ సదుపాయాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం కుసుమ్ పథకం అమలుపై రైతులకు అవగాహన కల్పించాలని, టీజీ రెడ్కో ద్వారా ఈ పథకం అమలు జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, రైతు సంక్షేమ కార్యక్రమాల వివరాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో రైతులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. అలాగే మే 4న ప్రారంభించనున్న టీజీ ఆర్గానిక్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించి, దాని వినియోగంపై మార్గదర్శనం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ నివాళులు

**- ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు , పిసిసి మెంబర్ మొహమ్మద్ జావిద్**



**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మరియు పిసిసి మెంబర్ మొహమ్మద్ జావిద్ అకాల మరణం సూర్యాపేట జిల్లా పిల్లల మర్రి దగ్గర ఏదైతే ఆక్సిడెంట్ లో మరణించడం జరిగింది. జావిద్ చిత్రపటానికి హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సేవాదళ్ సమర్థ శిక్షణ శిబిరంలో సంతాప సభ నిర్వహించడం జరిగింది. దీంట్లో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శ్రీమద్దేల జితేందర్ జాతీయ సేవాదళ్ కమాండర్ దేవేందర్ శర్మ జి స్టేట్ సేవాదళ్ సెక్రటరీ అబూబకర్ సిద్దిక్ జి మరియు ఖమ్మం జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, మరియు ఖమ్మం సేవాదళ్ టీం సభ్యులు బడే మియా, జానీ శ్రీనివాస్, నాలుగో డివిజన్ జానీ, మరియు హైదరాబాద్లో ఉన్నటువంటి సేవాదళ్ టీం సభ్యులందరూ మరియు మహిళా సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, డీసీలు సేవా ఇస్లావత్, శశిరేఖ, చాముండేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు మూడు నెలలు పూర్తయ్యాయని, ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "మేం పాలకులు కాదు, సేవకులం" అన్న భావనతో ప్రజల అవసరాలే కేంద్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మార్చి 6 నుంచి 99 రోజులపాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతం, కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని పిలుపునిచ్చారు. "తెలంగాణ రైజింగ్--2047" విజన్‌తో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ రంగాల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ 99 రోజుల కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఒక దీక్షగా భావించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలని సంకల్పం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఎల్లమ్మబండలో పెట్రోల్ బంక్ ఏర్పాటు, మహిళా భవనం నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.


# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట పట్టాలి: పోటు రంగారావు






**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధంగా అవలంబిస్తుందని ఆ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అశేష ప్రజానీకం పోరుబాట పట్టాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు శనివారం నాడు స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన శాఖా కార్యదర్శుల సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో ధరలు ఆకాశానికి ఎగబాకి సామాన్లు నడ్డి విరుస్తున్నాయని, రైతాంగం పండించిన పంటలు కొనే దిక్కు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర వాణిజ్య వినియోగ గ్యాస్ ధరలను భారీగా పెంచడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే గ్యాస్ తరులు పెంచడం అన్యాయమని ఆయన అన్నారు. ఇప్పటికే గ్యాస్ ఖర్చులు పెరగటంతో హోటల్ యజమానులు మరింత ఒత్తిడిలో ఉన్నారని తాజాగా ఈ ధరల పెంపుతో వారి భారాన్ని వినియోగదారిపై మోపుతారని ఫలితంగా హోటల్ ధరలు పెరుగుతాయి ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలపై దేశవ్యాప్తంగా. ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాబోయే జూన్ రెండు నాటికి తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూదాన భూమిలో ఇల్లు కోల్పోయిన బాదితులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన సందర్భంగా డిమాండ్ చేశారు. దేశంలో పెరుగుతున్న పాసిస్ట్ ప్రమాదాన్ని పార్టీ శాఖలు ప్రజల వద్దకు తీసుకెళ్లి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుర్రం మచ్చయ్య ఆవుల వెంకటేశ్వర్లు జి.రామయ్య సివై పుల్లయ్య ఆవుల అశోక్ బందెల వెంకయ్య శివలింగం ఏ వెంకటరెడ్డి ఝాన్సీ శిరోమణి శోభ గంటా శ్రీను లాల్మియా ఎం నాగేశ్వరరావు కే నాగేశ్వరరావు . కే శ్రీను లక్ష్మణ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# దుష్టశక్తులు ఎన్ని ఎత్తులు వేషినా జ్యోతిష్మతిపై నమ్మకం పోదు: జువ్వాడి సాగర్ రావు




**తిమ్మాపూర్,మే2 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో "ఉత్సవ్- 2026" పేరుతో కళాశాల వార్షికోత్సవ వేడుకలను యాజమాన్యం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రో.టి.కిషన్ కుమార్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.పెద్దపల్లి సత్తీష్ కుమార్,వరంగల్ నిట్ ప్రొ. ఆర్.బి.వి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై అటానమస్ చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం అతిథులు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక, సాంకేతికేతర రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలని కోరుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కంపెనీలు స్థాపించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలని కోరారు.కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు మాట్లాడుతూ....తమ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కళాశాలను నడుపుతున్నామని అందుకోసం కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.కానీ కొన్ని దుష్ట శక్తులు జ్యోతిష్మతి పేరును చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎవరెన్ని ఎత్తులు వేసినా విద్యార్థులకు జ్యోతిష్మతిపై నమ్మకం పెరుగుతుందే తప్ప తగ్గదని ధీమా వ్యక్తం చేస్తూ విద్యార్థులు చదుపై దృష్టి పెట్టి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్. టి. అనిల్ కుమార్, అకాడమీ డీమ్ డాక్టర్. పీకే. వైశాలి, వివిధ విభాగాఅధిపతులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు..

# ఎస్‌బివి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ద్రాక్ష, ఆరెంజ్ ఫ్లేవర్ వాటర్ పంపిణీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఎస్‌బివి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ చైర్మన్ సాయి సుహాస్ గౌడ్, ట్రెజరర్ నిఖిల్ గౌడ్ ల ఆధ్వర్యంలో శనివారం ద్రాక్ష, ఆరెంజ్ ఫ్లేవర్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు శీతల పానీయాలను అందించడం ద్వారా ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయి సుహాస్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక సేవే తమ ట్రస్ట్ లక్ష్యమని, ముఖ్యంగా వేసవిలో ప్రజలు ఎండ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ గౌడ్, పుట్ట వినయ్ గౌడ్, కబీర్ కౌశల్, మియాపూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మోహన్ ముదిరాజ్, బిజెపి నాయకులు సాయిరాం గౌడ్, ట్రస్టయ సభ్యులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ట్రస్ట్ సేవా భావాన్ని స్థానికులు అభినందించారు.

# మంత్రి ఇలాకా రెచ్చిపోతున్న విత్తన మాఫియా..!

**- విత్తన మాఫియా చేతిలో రైతుల జీవితాలు..! - కాటారంలో నకిలీ విత్తన మాఫియా మళ్లీ యాక్టివ్ - గ్రామాల్లో విక్రయించేందుకు ఏజెంట్ల నెట్వర్క్ ఏర్పాట్లు - ఫెర్టిలైజర్ షాప్ తనిఖీలు పేరుతో అధికారుల హడావుడి - మరి విత్తనం మాఫియా సంగతేమిటి..? - నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలం..!- కాటారం బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ రామిళ్ళ కిరణ్ ఆరోపణ**



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కాటారం మండలంలో వర్షాకాలం సీజన్ ప్రారంభ కాకముందే ఫేక్ సీడ్స్ ముఠాలు రంగంలోకి దిగి అమాయక రైతులకు నిషేధిత 'బీటీ-3' (హెచ్ బీటీ) పత్తి విత్తనాలను అంటగట్టి రైతుల జేబులు గుల్ల చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు కాటారం బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ రామిళ్ళ కిరణ్ ఆరోపించారు, రామిళ్ళ కిరణ్ మాట్లాడుతూ..కాటారంలో క్వింటాళ్ల కొద్ది నకిలీ విత్తనాలు సరఫరా ఏటా నిత్యకృత్యంగానే మారిపోతున్నాయి. అయితే ఇందులో పాత్రదారులెవ్వరు, సూత్రదారులెవ్వరు, సహకరించే వ్యవస్థ ఎక్కడుంది.. అందరూ కలిసి అన్నదాతల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు, ప్రతి ఏటా నకిలీ విత్తనాలు రైతన్నలన కష్టాలపాలు చేస్తుంది. దిగుబడి రాక కొంతమంది పెట్టిన విత్తనాలు మొలకెత్తక మరికొంతమంది నష్టపోతూనే ఉన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాకముందే విత్తన మాఫియా కాటారం జడలువిప్పుతోంది. వేసవి ప్రారంభం కంటే ముందే లూజ్ విత్తనాలు డంప్ చేసుకుని మరీ తమ ఆగడాలకు పదునుపెడుతున్నారు. మండలంలో కొంతమంది ముఠాలుగా ఏర్పడి తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.దందా వెనుక అధికారంలో ఉన్న కొందరు పెద్దల అండదండలు ఉన్నట్లు కిరణ్ ఆరోపించారు, గతంలో కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఓ ముఠా టాస్క్ ఫోర్స్ పోలీసులకు చిక్కింది. స్టేషన్ పోలీసులు ఉన్నా టాస్క్ ఫోర్స్ పోలీసులు మాత్రమే పట్టుకోవడం, సంబంధిత అధికారులు పాత్ర పై అనుమానాలకు ఉన్నాయి, గతంలో కొందరు కేటుగాళ్లు భారీ సంఖ్యలో పట్టుకుని సీజ్ చేసి నిందితులపై కేసులు పెట్టినా.. ఆఖరికి పీడీ యాక్టులు సైతం అమలు చేసినా కొందరికి బుద్ధి మారలేదు, రైతుల శ్రేయస్సు కోరే ప్రభుత్వమే అయితే, ఈ పాటికే ఈ ముఠాపై ఎందుకు నిఘా పెట్టలేదని అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు మేల్కొని, సరిహద్దుల వద్ద తనిఖీలు కఠినతరం చేయాలి, కేవలం కింద స్థాయి ఏజెంట్లను పట్టుకోవడం కాదు, దీని వెనుక ఉన్న విత్తన మాఫియాను బయట పెట్టాలి. ఈ ప్రమాదకర విత్తనాల వాడకం వల్ల భూసారం క్షీణించి, ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా రావాల్సిన పత్తి దిగుబడి.. ఈ ఏడాది కేవలం 5 క్వింటాళ్లకే పరిమితమైందని పెట్టిన పెట్టుబడులు కూడా వెనక్కి రాక రైతులు అప్పుల పాలై అల్లాడిపోతున్నారని ఇప్పటికైనా అధికారులు విత్తన మాఫియా పై కఠిన చర్యలు తీసుకోకపోతే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని రామిళ్ళ కిరణ్ ఆరోపించారు.

# ప్రతి శనివారం అన్నదానం రామప్రభు సేవా స్ఫూర్తి



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అనేక మంది నిరుపేదలకు, అవసరమైన వారికి భోజనం అందజేశారు. ఈ సందర్భంగా రామప్రభు మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహాదానం అని, సమాజంలో ఎవ్వరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, దయాకర్, నిమ్మల రామకృష్ణ గౌడ్, రాజశేఖర్, గిరి, నాగరాజు, బాబ్జి, జె ఎమ్ శంకర్, ఉమ కిషన్, వెంకటేశ్వర్లు, కృష్ణ, గిరి, దినేష్, శ్రీరామ్, స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు, ఎఆర్పీ టీమ్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్నదానం పొందిన లబ్ధిదారులు రామప్రభు, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాధలో ఉన్నవారికి బలాన్ని అందించే సీఎం రిలీఫ్ ఫండ్ : జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సీఎంఆర్ఎఫ్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా నిరాశలో ఉన్నవారికి ఆశను, బాధలో ఉన్నవారికి బలాన్ని అందించే కీలక ఆధారమని జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ రాజ్యం' లక్ష్యంతో ప్రతి కుటుంబానికి సంక్షేమం చేరేలా కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. అనారోగ్యం వంటి సంక్షోభ పరిస్థితుల్లో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని, అలాంటి సమయంలో ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ సహాయం వారికి పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక కుటుంబాలకు ఈ నిధి ద్వారా సహాయం అందుతూ ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏకే బాలరాజ్, రాములు గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, కావూరి ప్రసాద్, పట్వారీ శశిధర్, సంజు, మోహన్ రెడ్డి, చిన్న, రాంచందర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, ముజీబ్, సుధాకర్, తిరుపతి, వెంకన్న, ప్రభాకర్, జావేద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం....



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ శ్రమ శక్తి అవార్డు 2026 గ్రహీత జక్కుల రాజేశం పటేల్ ను జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ సన్మానించారు. పెద్దపల్లి మండలం గుర్రం పల్లెకు చెందిన కార్మిక సంఘ నాయకుడు, మాజీ సింగరేణి కార్మికుడు జక్కుల రాజేశం పటేల్ 2018లో రిటైర్డ్ అయినప్పటికీ ఇప్పటికీ కార్మికుల సమస్యలపై తన గళం విప్పు తూనే ఉన్నారని కొనియాడారు. కార్మికవర్గ పోరాటాల్లో ఆయన కృషిని గుర్తించిన ప్రభుత్వం శ్రమ శక్తి అవార్డును ప్రకటించడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్ నేత, బీసీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ కోమటిపల్లి రాజేందర్ నేత అమర్శెట్టి సంజీవ్ పటేల్, రవికిరణ్ నేత మొదలైన వారు పాల్గొన్నారు.

# విలేకరి దహన సంస్కారాలకై రావుల రమేష్ ఆర్థిక సాయం

**తిమ్మాపూర్, మే2(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన విలేకరి బొజ్జ రాజ్ కుమార్ ఆత్మహత్య చేసుకోని మృతి చెందగా శనివారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశం మేరకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేష్ దహన సంస్కారానికై 20వేల ఆర్థిక సహాయాన్ని రాజ్ కుమార్ కుటుంబ సభ్యులకు అందించారు. తన కలంతో సమాజానికి సేవ చేసిన రాజ్ కుమార్ కలం నేటాతో మూగబోయిందని విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు వ. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పాశం అశోక్ రెడ్డి, రెడ్డి తిరుపతి రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, మాతంగి లక్ష్మణ్, నీలం ఓదెలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ ఆలోచన లేదు: స్టార్క్

## స్పోర్ట్స్



ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. సుదీర్ఘ విరామం, గాయాల తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్టేడియంలో అడుగుపెట్టాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్ తన రీ-ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ బ్యాటర్లను వణికించి 3 కీలక వికెట్లు పడగొట్టి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే మ్యాచ్ సమయంలో స్టార్క్ బౌలింగ్ చేతికి భారీగా కట్లు ఉండటం చూసి అతని ఫిట్ నెస్ ఇంకా పూర్తిస్థాయిలో లేదని.. త్వరలోనే ఆయన ఆటకు స్వస్తి పలుకుతాడని సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఈ పుకార్లకు మిచెల్ స్టార్క్ మ్యాచ్ అనంతరం ముగింపు పలికాడు. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి నాకు అలాంటి ఆలోచనే లేదు. చేతికి కట్లు ఉండటం చూసి రిటైర్మెంట్ గురించి మాట్లాడటం కాస్త వింతగా ఉంది. నేను ఇంకా ఆ దశకు చేరుకోలేదని భావిస్తున్నాను" అని మిచెల్ స్టార్క్ స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉండి.. కేవలం ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకోవడంపైనే దృష్టి సారించానని, ఇప్పుడు మైదానంలోకి తిరిగి రావడం తనలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని స్టార్క్ కుండబద్దలు కొట్టాడు. 35 ఏళ్ల వయసులో కూడా తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఈ సందర్భంగా స్టార్క్ చాటిచెప్పాడు.రాజస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభమైన మొదటి ఓవర్‌లోనే మిచెల్ స్టార్క్ తన సత్తా ఏంటో చూపించాడు. యువ సంచలనం యశస్వి జైస్వాల్ మొదటి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్‌తో స్టార్క్‌ను స్వాగతించినప్పటికీ.. స్టార్క్ మాత్రం తడబడలేదు. మూడో బంతికే అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను ఔట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆ తర్వాత సెంచరీకి చేరువవుతున్న రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌తో పాటు రవీంద్ర జడేజా వికెట్లను కూడా తీసి రాజస్థాన్ స్కోరు వేగానికి బ్రేకులు వేశాడు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి తన రాకను ఘనంగా చాటాడు.దాదాపు 3 నెలల పాటు ఏ బ్యాటర్‌కు బౌలింగ్ చేయకుండా నేరుగా ఐపీఎల్ లాంటి హై-వోల్టేజ్ టోర్నీలో ఆడటం అంత సులభం కాదని స్టార్క్ అంగీకరించాడు. "బౌలింగ్ స్పీడ్ అందుకోవడానికి, మ్యాచ్ రిథమ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ నాకు బాగా ఉపయోగపడింది. నా మోచేయి గాయం కారణంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. దానికి తగ్గట్టుగా బౌలింగ్ శైలిని మార్చుకుంటున్నాను. ఈ విజయం జట్టుకు ఎంత ముఖ్యమో, నా ఆత్మవిశ్వాసానికి కూడా అంతే ముఖ్యం. రాబోయే మ్యాచ్‌ల్లో నా బౌలింగ్ ప్రదర్శన మరింత మెరుగుపడుతుందని నమ్ముతున్నాను" అని స్టార్క్ ఆశాభావం వ్యక్తం చేశాడు.



## మీరు చదివే ప్రతిదానిని నమ్మకండి

### క్రీడా వ్యాఖ్యాత యెషా సాగర్

గత కొన్ని రోజుల.ుగా సోషల్ మీడియాలో ఒక యువ క్రికెటర్ మరియు మహిళా యాంకర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అందులో ఆ క్రికెటర్ ఆమెను తీవ్రంగా నియంత్రిస్తున్నాడని వార్తలు గుప్పుమన్నాయి. జర్నలిస్ట్ అభిషేక్ త్రిపాఠి చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. అధికారికంగా పేర్లు వెల్లడించనప్పటికీ, నెటిజన్లు మాత్రం ఆ జంట సమీర్ రిజ్వీ, యెషా సాగర్ అని ఒక నిర్ణయానికి వచ్చేశారు. సమీర్ రిజ్వీ తనపై మత మార్పిడి కోసం ఒత్తిడి చేస్తున్నాడని, క్రీడా వ్యాఖ్యాతగా పని చేస్తున్న సమయంలో ఇతర క్రికెటర్లతో షేక్ హ్యాండ్ చేయకుండా కేవలం నమస్కారం మాత్రమే చేయాలని షరతులు విధించాడని వార్తలు వచ్చాయి. అంతేకాకుండా, ఆమె సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి కొన్ని రకాల ఫొటోలను తొలగించాలని కూడా ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇవి అత్యంత సున్నితమైన అంశాలు కావడంతో ఈ వివాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది.ఈ వివాదం మరింత ముదురుతుండటంతో యెషా సాగర్ తన సోషల్ మీడియా వేదికగా ఒక రహస్య సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియాలో మీరు చూసే లేదా చదివే ప్రతిదానిని నమ్మకండి" అని ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా సమీర్ రిజ్వీతో తనపై వస్తున్న ఆరోపణలను ఆమె పరోక్షంగా ఖండించారు. అయితే, సమీర్ రిజ్వీ ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరు పక్షాలు ప్రస్తుతం ఈ సున్నితమైన అంశంపై మౌనాన్ని పాటిస్తున్నాయి. యెషా సాగర్ ప్రముఖ క్రీడా వ్యాఖ్యాత, మోడల్. పంజాబ్‌లోని లూథియానాలో జన్మించిన ఆమె, ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లారు. తొలుత పంజాబీ మ్యూజిక్ వీడియోల ద్వారా గుర్తింపు పొందిన ఆమె, తర్వాత క్రీడా రంగంపై ఆసక్తితో వ్యాఖ్యాతగా మారారు. గ్లోబల్ టీ20 కెనడా, యూపీ టీ20 లీగ్, మహిళా ప్రీమియర్ లీగ్ వంటి వేదికలపై ఆమె పనిచేశారు. నివేదికల ప్రకారం, యూపీ టీ20 లీగ్ సమయంలో సమీర్ రిజ్వీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సమీర్ రిజ్వీ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అద్భుతంగా రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో 149.28 స్ట్రైక్ రేట్‌తో 209 పరుగులు చేశారు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడినప్పటికీ, ఈ ఏడాది ఢిల్లీ జట్టులో ఆయన కీలక ఆటగాడిగా మారారు.

## ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్న కేఎల్ రాహుల్

రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ కేఎల్ రాహుల్ విశ్వరూపం ప్రదర్శించాడు. 226 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఏమాత్రం తడబడకుండా కేవలం 40 బంతుల్లోనే 75 పరుగులు సాధించాడు. తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఆయన ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో బాదిన 5 సిక్సర్ల ద్వారా కేఎల్ రాహుల్ ఐపీఎల్ చరిత్రలో ఓపెనర్‌గా 200 సిక్సర్ల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు భారత్ నుంచి మరే ఓపెనర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రిస్ గేల్ (326), డేవిడ్ వార్నర్ (210) మాత్రమే రాహుల్ కంటే ముందున్నాడు. ప్రస్తుతం 203 సిక్సర్లతో రాహుల్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.భారత క్రికెట్‌లో అత్యంత నమ్మదగ్గ ఆటగాడిగా గుర్తింపు పొందిన రాహుల్, ఓపెనర్‌గా తనదైన ముద్ర వేశాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఓపెనర్‌గా 112 మ్యాచ్‌లు ఆడి 50.1 సగటుతో 4851 పరుగులు సాధించాడు. ఇందులో 6 శతకాలు, 39 అర్ధ శతకాలు ఉండటం విశేషం. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 192 సిక్సర్లతో రాహుల్ వెనుక ఉండగా, రోహిత్ శర్మ కనీసం మొదటి ఐదు స్థానాల్లో కూడా లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుత సీజన్ ఆరంభంలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనప్పటికీ, ఆ తర్వాత రాహుల్ తన ఫామ్‌ను అందిపుచ్చుకున్నాడు. ఢిల్లీ తరపున 9 ఇన్నింగ్స్‌ల్లో 185.83 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 433 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్‌పై ఆయన చేసిన 152 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఐపీఎల్ చరిత్రలోనే మూడవ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది. తన విలువేంటో మరోసారి నిరూపిస్తూ రాహుల్ పరుగుల యంత్రంలా దూసుకుపోతున్నాడు.





## బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాల చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది. పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న == జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధృవ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

## వైభవ్ సూర్యవంశీని చూసి భయపడ్డాను


### వైభవ్ సూర్యవంశీ భయం లేని ఆటగాడు

### ఢిల్లీ స్టార్ పేసర్ కైల్ జేమీసన్ ప్రశంసా

వైభవ్ సూర్యవంశీ ఆటతీరును ప్రశంసించాడు. "నా జీవితంలో 15 ఏళ్ల పిల్లాడిని చూసి ఇంతలా భయపడతానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ వైభవ్ భయం లేని ఆటగాడు. అతని కోసం మేము ప్రత్యేక ప్రణాళికలు రచించాం. రాజస్థాన్ జట్టుకు ఓపెనర్లు వైభవ్, జైస్వాల్ ఇచ్చే ఆరంభం చాలా కీలకం. అందుకే వారిని త్వరగా ఔట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ ప్లాన్ వర్కౌట్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అందుకే అలా సెలబ్రేషన్ చేశాను." అని కైల్ జేమీసన్ పేర్కొన్నాడు.రాజస్థాన్ రాయల్స్ జట్టు టాపార్డర్‌ను దెబ్బతీయడమే తమ ప్రధాన ఉద్దేశమని జేమీసన్ వివరించాడు. పవర్‌ప్లేలో పరుగుల వేగాన్ని అడ్డుకోవడానికి మిచెల్ స్టార్క్, తాను కలిసి చేసిన ప్రయత్నం ఫలించిందని చెప్పాడు. స్టార్క్ హై ఫుల్ టాస్‌తో ఒక వికెట్ తీయగా.. తాను అద్భుతమైన యార్కర్‌తో వైభవ్ వికెట్ తీయడం వల్ల రాజస్థాన్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని అడ్డుకోగలిగామని తెలిపాడు. జేమీసన్ మాటలు ఎలా ఉన్నా.. మైదానంలో అతను ప్రదర్శించిన దూకుడును బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతనికి ఓ డెమెరిట్ పాయింట్‌తో పాటు జరిమానా కూడా విధించింది. జేమీసన్ కూడా తన తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ శిక్షను ఖరారు చేశారు. ఢిల్లీ మ్యాచ్ గెలిచినప్పటికీ, జేమీసన్ ప్రవర్తన మాత్రం ఈ మ్యాచ్‌లో ఓ మాయని మచ్చలా మిగిలిపోయింది.


# జెమీసన్ ప్రవర్తనపై నెటిజన్ల ఫైర్

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతి మ్యాచ్‌లోనూ రికార్డుల వేట కొనసాగిస్తున్నాడు. అయితే దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన లేటెస్ట్ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడికి ఒక చేదు అనుభవం ఎదురైంది. సాధారణంగా వికెట్ తీసినప్పుడు బౌలర్లు సంబరాలు చేసుకోవడం సహజమే కానీ దిల్లీ పేసర్ కైల్ జెమీసన్ మాత్రం హద్దులు దాటి ప్రవర్తించాడు. తనకంటే సగం వయసున్న వైభవ్‌ను అవుట్ చేసిన తర్వాత జెమీసన్ ఇచ్చిన అగ్రెసివ్ సెండ్ ఆఫ్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. ఒక చిన్న పిల్లాడిపై అంత కోపం చూపించాల్సిన అవసరం ఏముందని నెటిజన్లు జెమీసన్‌ను ఏకిపారేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. మ్యాచ్ రెండో ఓవర్‌లోనే ఈ డ్రామా చోటుచేసుకుంది. జెమీసన్ వేసిన నాలుగో బంతిని వైభవ్ అద్భుతమైన ఫోర్‌గా మలిచాడు. ఆ మరుసటి బంతికే జెమీసన్ ఒక పదునైన ఇన్ స్వింగింగ్ యార్కర్ వేశాడు. ఆ వేగాన్ని అంచనా వేయడంలో విఫలమైన వైభవ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. వికెట్ పడగానే జెమీసన్ ఒక్కసారిగా వైభవ్ వైపు చూస్తూ గట్టిగా అరుస్తూ సెండ్ ఆఫ్ ఇచ్చాడు. ఒక సీనియర్ స్టార్ ప్లేయర్‌ను అవుట్ చేసిన రేంజ్‌లో జెమీసన్ ఇచ్చిన రియాక్షన్ చూసి స్టేడియంలో ఉన్న వారంతా షాక్ అయ్యారు. ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న వైభవ్ కేవలం 4 పరుగులకే వెనుదిరగడం రాజస్థాన్ రాయల్స్‌కు గట్టి దెబ్బే అని చెప్పాలి.ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు దిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైల్ జెమీసన్‌కు బీసీసీఐ వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఒక డెమెరిట్ పాయింట్‌ను విధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీని అవుట్ చేసిన తర్వాత జెమీసన్ అతనికి చాలా దగ్గరగా వెళ్లి అగ్రెసివ్‌గా ప్రవర్తించాడని ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. ప్రత్యర్థి ఆటగాడిని రెచ్చగొట్టేలా లేదా అవమానించేలా ప్రవర్తించడం ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.5 ప్రకారం నేరం కావడంతో మ్యాచ్ రెఫరీ రాజీవ్ సేథ్ ఈ శిక్షను ఖరారు చేశారు. జెమీసన్ తన తప్పును ఒప్పుకోవడంతో పాటు ఈ జరిమానాను అంగీకరించినట్లు సమాచారం.భారత మాజీ క్రికెటర్ ప్రియాంక్ పాంచల్ ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 31 ఏళ్ల కైల్ జెమీసన్ ఒక 15 ఏళ్ల పిల్లాడిని అవుట్ చేసి అలా ప్రవర్తించడం అస్సలు చూడముచ్చటగా లేదని మండిపడ్డారు. అది అనవసరమైన రియాక్షన్ అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే జెమీసన్‌లో ఉన్న ఆ కసిని చూస్తుంటే వైభవ్ అంటే ప్రత్యర్థుల్లో ఎంత భయం మొదలైందో అర్థమవుతోందని పాంచల్ కౌంటర్ వేశారు. ఒక చిన్న పిల్లాడు కూడా ఇంటర్నేషనల్ స్టార్లను వణికిస్తున్నాడనడానికి జెమీసన్ రియాక్షనే నిదర్శనమని క్రికెట్ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ రెండు అరుదైన ప్రపంచ రికార్డులను అందుకునే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయాడు. టీ20 క్రికెట్‌లో తక్కువ బంతుల్లో 100 సిక్సర్లు బాదిన కీరన్ పొలార్డ్ రికార్డును బద్దలు కొట్టడానికి వైభవ్‌కు కేవలం ఒక్క సిక్సర్ మాత్రమే కావాలి. అలాగే 20 ఏళ్ల వయసు కంటే ముందే 100 టీ20 సిక్సర్లు కొట్టిన మొదటి ప్లేయర్‌గా చరిత్ర సృష్టించే ఛాన్స్ కూడా జెమీసన్ వల్ల మిస్సయ్యింది. ఈ సీజన్ లో ఇప్పటికే 10 మ్యాచ్‌ల లో 404 పరుగులు చేసిన వైభవ్ సగటు 40.40 గా ఉండగా స్ట్రైక్ రేట్ ఏకంగా 237.64 గా ఉండటం విశేషం. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.వైభవ్ త్వరగానే అవుట్ అయినా రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాత్రం తన బ్యాట్?కు పని చెప్పాడు. ఈ సీజన్ లో వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొన్న పరాగ్ దిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 50 బంతుల్లోనే 90 పరుగులు చేసి తన విమర్శకుల నోళ్లు మూయించాడు. ధ్రువ్ జురెల్ (40) తో కలిసి నాలుగో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.




# విశ్వేజి

# డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టి పెట్టే సూపర్ ఫుడ్ !..



### రోజూ ఇలా ట్రై చేయండి.

క్వినోవా అనేది పోషకాలను సమృద్ధిగా కలిగి ఉన్న శక్తివంతమైన ధాన్యం. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికా దేశాల్లో ఉత్పత్తి అవుతూ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్నేహితుల ఆహార జాబితాలో కీలకంగా మారింది. ఇది ప్రోటీన్లకు గొప్ప మూలంగా ఉండటమే కాకుండా, గ్లూటెన్-ఫ్రీ ఫుడ్ కావడం వల్ల చాలా మంది ఆరోగ్య పరంగా దీన్ని తమ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. దీన్ని ఆహారంగా చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్వినోవా యొక్క ప్రయోజనాలు: క్వినోవాలో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది శాకాహారులు మరియు శాఖాహారులకు ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది . మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. క్వినోవాలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ %దీ% వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ధాన్యంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. క్వినోవా గ్లూటెన్ రహితమైనది, కాబట్టి ఇది ఉదరకుహర వ్యాధి లేదా గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది మనకు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన మనం తక్కువ ఆహారం తీసుకుంటాము మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్వినోవాలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్వినోవాలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది , డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని అన్నం లాగా వండుకోవచ్చు లేదా సలాడ్లు, సూప్‌లు, స్మూతీలలో కూడా ఉపయోగించవచ్చు. దీనిని పిండిగా కూడా ఉపయోగించి రొట్టెలు, ఇతర బేక్ చేసిన వస్తువులను తయారు చేయవచ్చు. ఇది పోషకమైన ఆరోగ్యకరమైన ఆహారం. దీనిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## చెడు కొవ్వు కరిగించే ఈ కూరగాయలు తినండి... రిజల్ట్ మీరే చూడండి!

బరువు తగ్గాలని భావించేవారు బరువు తగ్గటం కోసం ఏం తినాలి? ఏం తినకూడదు అనేది కచ్చితంగా తెలుసుకోవాలి. ఇటీవల కాలంలో బరువు తగ్గటం కోసం చాలా మంది రకరకాల డైట్‌లను ఫాలో చేస్తున్నారు. అయితే బరువు తగ్గాలంటే, సులభంగా బరువు తగ్గించే ఆహారాలను తినాలని కొందరు డైటీషియన్స్ చెప్తున్నారు. అయితే బరువుకు చెక్ పెట్టటంలో కొన్ని కూరగాయల పాత్ర చాలా ఉంటుందని అంటున్నారు. దోసకాయ దోసకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. దోసకాయాలలో ఫైబర్ అధికంగా ఉండటం కారణంగా ఇది బరువు తగ్గటానికి బాగా ఉపయోగపడుతుంది. దోసకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మన కడుపు నిండిన ఫీలింగ్ కలిగిస్తుంది. దోసకాయలు ఆకలిని తగ్గిస్తాయి. ఇవి మన బరువును నియంత్రణలో ఉంచుతాయి. సొరకాయ సొరకాయలో కూడా బరువును తగ్గించే బోలెడు పోషకాలు ఉంటాయి. సొరకాయలో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. సొరకాయను కూడా మనం ఆహారంలో భాగంగా చేసుకుంటే బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. సొరకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువ.. ఇది మన ఆకలిని తగ్గిస్తుంది. దీంతో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. పుచ్చకాయ పుచ్చకాయ బరువు తగ్గటానికి ఎంతగానో దోహదం చేస్తుంది. పుచ్చాకాయలో కూడా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. పుచ్చకాయలో విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇది జీవక్రియను పెంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయ గింజల్లో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ తో పాటు బోలెడు పోషకాలు ఉంటాయి. ఇవి కడుపు నిండుగా ఉండేందుకు, ఆకలిని తగ్గించడంలో సహాయపడతాయి. ఫలితంగా ఇవి మన బరువును తగ్గిస్తాయి. గుమ్మడికాయ గుమ్మడికాయలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి గుమ్మడికాయ మన బరువు తగ్గడానికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది ఇందులో ఫైబర్ నీరు అధికంగా ఉండడం వల్ల మన కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది గుమ్మడికాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ఇది మన బరువును తగ్గించడానికి దోహదం చేస్తుంది. వీటితో కూడా బరువు తగ్గొచ్చు ఇక ఇవి మాత్రమే కాదు బ్రోకలీ, క్యాబేజ్, క్యాలీ ఫ్లవర్, పాలకూర, పుట్ట గొడుగులు కూడా మన ఆకలిని తగ్గించి మనం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. కనుక పై ఆహారాలు మీ భోజనంలో భాగం చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది.

## పండ్లు తింటే ఆరోగ్యమని అతిగా తింటున్నారా? అయితే జాగ్రత్త!



చాలామంది పండ్లను ఇష్టంగా తింటారు. పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటామని భావించి ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పండ్లను తమ ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. అయితే పండ్లు తింటే ఆరోగ్యం వస్తుందన్నమాట వాస్తవమే అయినప్పటికీ అతిగా పండ్లు తినడం మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. పండ్లను అతిగా తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పండ్లు ఎక్కువ తింటే ఏమవుతుంది పండ్లలో సహజంగానే చక్కెరలు, క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటామని భావించి వీటిని అతిగా తింటే బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు విపరీతంగా పండ్లు తింటే పండ్లలో ఉండే చక్కెర శరీరంలో డయాబెటిస్ ను పెంచుతుందని డయాబెటిస్ బాధితులుగా మారే ప్రమాదం ఉంటుందని కూడా హెచ్చరిస్తున్నారు. అతిగా పండ్లు తింటే ఈ అనారోగ్య సమస్యలు చాలామంది అన్నం తినడం మానేసి పండ్లను ఎక్కువగా ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. పండ్లలో చక్కెర, పీచు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా డయాబెటిస్ ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంటుందని జీర్ణ వ్యవస్థకు సంబంధించి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కడుపు ఉబ్బరం, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు అందుకే పండ్లు తినాలి అనుకునేవారు రోజుకు ఎన్ని పండ్లు తినాలనేది కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రతీరోజూ ఇన్ని పండ్లు మాత్రమే తినాలి పండ్లు ఇష్టంగా తినేవారు ప్రతిరోజు మూడు నుంచి నాలుగు మాత్రమే పండ్లు తినాలి. 500 గ్రాములలోపు పండ్లను మాత్రమే తినవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంతకంటే ఎక్కువ మొత్తంలో పండ్లను తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. కనుక పండ్లు తినాలి అని భావించేవారు మితంగానే పండ్లు తినాలని గుర్తుంచుకోవాలి. ఇక పండ్ల జ్యూస్ లను చేసుకుని ఎక్కువగా తాగే వారు కూడా డయాబెటిస్ బాధితులుగా మారతారని హెచ్చరిస్తున్నారు. పండ్ల జ్యూస్ లు ఎక్కువగా తాగితే మంచిది కాదు... జాగ్రత్త పోషకాల పరంగా చూస్తే పండ్లను జ్యూస్ గా చేసి తాగడం వల్ల వాటిలో 60 శాతం యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయని ఇక పండ్లను జ్యూస్ గా చేసుకుని తాగే కంటే నేరుగా తినడం మంచిదని చెబుతున్నారు. కనుక పండ్లు అతిగా తినేవారు తప్పక మీ ఆలోచన మార్చుకోవాల్సిందే. అలా కాకుండా విపరీతంగా పండ్లను తింటే మాత్రం అనవసరమైన అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

## ఆలివ్ ఆయిల్ వాడుతున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి!

ఆలివ్ ఆయిల్ అనేది ఆలివ్ పండ్ల నుండి తీయబడిన ఒక రకమైన వంట నూనె. ఇది మధ్యధరా ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను చేకూరుస్తుంది, కానీ కొన్ని సందర్భాల్లో ఇది దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుంది. ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా లేదా తప్పుగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కలిగిస్తుంది. ప్రతి రోజూ ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుందాం.. 1. అలర్జీ ప్రతిచర్యలు: కొంతమందికి ఆలివ్ ఆయిల్‌కు అలర్జీ ఉండవచ్చు. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఒకవేళ మీకు ఆలివ్ ఆయిల్ తీసుకున్న తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే దానిని తీసుకోవడం ఆపేసి వైద్యుని సంప్రదించాలి. 2. జీర్ణ సమస్యలు: ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు కలుగుతాయి. ఆలివ్ ఆయిల్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, జీర్ణ సమస్యలు ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది. 3. చర్మ సమస్యలు: ఆలివ్ ఆయిల్ అన్ని రకాల చర్మాలకు సరిపోదు. ముఖ్యంగా జిడ్డు చర్మం కలిగినవారు ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా వాడటం వల్ల మొటిమలు వచ్చే అవకాశం ఉంది. ఆలివ్ ఆయిల్‌లో ఒలియిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మం యొక్క సహజ నూనెలను తొలగించగలదు, దీనివల్ల చర్మం పొడిబారవచ్చు. కాబట్టి, మీ చర్మ తత్వాన్ని బట్టి ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం మంచిది.



# మార్కెట్




## వైజాగ్‌లో వొడా ఐడియా 5జీ సేవలు

న్యూఢిల్లీ, : నిధులు లేక సతమతమవుతున్న ప్రముఖ టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా దేశవ్యాప్తంగా 5జీ సేవలు అందించడానికి సిద్ధమైంది. ఇప్పటికే మెట్రో నగరాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ..తాజాగా మరో 23 నగరాల్లో ఈ సేవలను స్టార్ట్ చేసింది. వీటిలో వైజాగ్‌తోపాటు అహ్మదాబాద్, ఆగ్రా, ఔరంగాబాద్, కొచ్చి, ఇండోర్, జైపూర్, కోల్‌కతా, లఖ్నో, మధురై, మలప్పురం, మీరట్, నాగపూర్, నాసిక్, పుణె, రాజ్‌కోట్, సోన్‌పేట్, సూరత్, త్రివేండ్రం, వడొదరలలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపింది. ఇప్పటికే సంస్థ ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, చండీఘడ్, పాట్నాలలో సంస్థ 5జీ సేవలను ప్రారంభించింది.

ఇంకా చదవల్సిన వార్తలు

### చిన్న మొత్తాలపై వడ్డీ యథాతథం

న్యూఢిల్లీ : చిన్న మొత్తాలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను పీపీఎఫ్, ఎన్‌ఎస్‌ఈల వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడానికి సర్కార్ మొగ్గుచూపింది. దీంతో వరుసగా ఆరు త్రైమాసికాలుగా వడ్డీరేట్లను ముట్టుకోకపోవడం విశేషం. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ వడ్డీరేట్లు వర్తించనున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. సుఖణ్య సమృద్ధి స్కీంపై 8.2 శాతం వడ్డీని, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌పై 7.1 శాతం, పోస్టాఫీస్ సేవింగ్ డిపాజిట్ స్కీంపై 4 శాతం, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

## పాన్ కార్డ్ నుంచి రైలు టికెట్ వరకు.. జులై ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఇవే..!




ఈ ఆర్థిక సంవత్సరంలో మరో మాసం ముగిసింది. రేపటి నుంచి జులై ప్రారంభం కానున్నది. అయితే, జులై ఒకటి నుంచి పలు కీలక రూల్స్ మారబోతున్నాయి. ఇవి సామాన్యుల దైనందిన జీవితం, ఖర్చులపై ప్రత్యక్షంగా ప్రభావం చూపనున్నది. ఇందులో పాన్‌కార్డ్ నుంచి బ్యాంకింగ్, రైల్వే టికెట్ బుకింగ్, గ్యాస్ సిలిండర్ ధర, క్రెడిట్ కార్డుల వరకు రూల్స్ ఉన్నాయి. ఈ కొత్త నిబంధనలు అమలులోకి వస్తే మీ జేబులపై భారం పడొచ్చు. కొన్ని సందర్భాల్లోనూ ఊరట కలిగించే అవకాశాలున్నాయి. అయితే, జులై ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఏంటో ఓసారి చూద్దాం..!

పెరగనున్న రైలు టికెట్ చార్జీలు..

జులై ఒకటి నుంచి రైలు టికెట్ చార్జీలు పెరగనున్నాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, నాన్ ఏసీ క్లాస్ చార్జీలను పెంచేందుకు రైల్వేమంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తున్నది. నాన్ ఏసీ (స్లీపర్, సెకండ్ సీటింగ్) కేటగిరిల్లో టికెట్‌పై కిలోమీటర్‌కు ఒక పైసా, థర్డ్ ఏసీ నుంచి ఫస్ట్ ఏసీ వరకు అన్ని క్లాస్‌లలో కిలోమీటర్‌కు 2 పైసలు పెరుగనున్నది. 500 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి సెకండ్ క్లాస్ రైలు టికెట్ల ధరలు, ఎంఎస్‌టీలో ఎలాంటి మార్పులు ఉండవు. కానీ, 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే.. ఆ ప్రయాణికులు ప్రతి కిలోమీటర్‌కు అర పైసా చెల్లించాల్సి ఉంటుంది.

తత్కాల్ టికెట్ల బుకింగ్ ఇక కఠినం..

రైల్వేశాఖ జులై ఒకటి నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌ను కఠిన తరం చేసింది. ఇకపై తత్కాల్ టికెట్లు ఐఆర్‌సీటీసీ అకౌంట్‌తో ఆధార్ లింక్ చేసిన ప్రయాణికులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. జులై ఒకటి నుంచి ఓటీపీ ఆధారిత అథంటికేషన్ తప్పనిసరి చేసింది. దాంతో ఆధార్ అకౌంట్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. తత్కాల్ బుకింగ్ ప్రారంభమైన మొదటి అరగంటలో రైల్వే ఏజెంట్లు బుకింగ్ చేసేందుకు అనుమతి ఉండదు. ఏజెంట్లు పెద్ద ఎత్తున టికెట్లను బుక్ చేస్తున్నారని విమర్శల నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ ఈ నిర్ణయం తీసుకున్నది. దాంతో ప్రయాణికులకు ఊరట కలుగనున్నది.

పాన్‌కార్డు రూల్స్‌లో మార్పులు..

పాన్ కార్డుల రూల్స్ సైతం మారబోతోన్నాయి. జులై ఒకటి నుంచి కొత్త పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు కాపీని అందించడం తప్పనిసరి. సీబీడీటీ ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నది. మీకు ఇప్పటికే పాన్, ఆధార్ కార్డు ఉంటే.. వాటిని లింక్ చేయడం తప్పనిసరి. ఈ రెండింటిని నుసంధానించేందుకు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు అనుమతి ఇచ్చింది.

### క్రెడిట్ కార్డ్ బిల్లుల చెల్లింపు కోసం కొత్త వ్యవస్థ

అన్ని రకాల క్రెడిట్ కార్డుల బిల్లుల చెల్లింపు కోసం కొత్త వ్యవస్థ అందుబాటులోకి రాబోతున్నది. భారత్ బిల్ చెల్లింపు వ్యవస్థ (%దీదీూా%) వ్యవస్థ ద్వారానే అన్ని క్రెడిట్ కార్డ్ బిల్లులను చెల్లించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. ఈ నిర్ణయంతో బిల్ డెస్క్, ఫోన్‌పే, క్రెడ్ వంటి యాప్‌లను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎనిమిది బ్యాంకులు మాత్రమే బీబీపీఎస్ సౌకర్యాన్ని ప్రారంభించాయి.

### ఎక్కువ గంటలు పనిచేయొద్దు.. ఉద్యోగులకు ఇన్ఫీ కీలక సూచన

దేశం పురోగతి సాధించాలంటే యువత 70 గంటలు పనిచేయాల్సిందేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో పని గంటలపై ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తాజాగా కీలక సూచన చేసింది. నిర్దేశిత పనివేళలు ముగిసిన తర్వాత అదనంగా పని చేయొద్దని ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉద్యోగులకు ఈమెయిల్స్ ద్వారా సూచిస్తోంది. ఉద్యోగులు అదనపు పని గంటలు, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు సంస్థ గుర్తించింది. ఈ మేరకు ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ కీలక సూచన చేసింది. ఇన్ఫోసిస్ ప్రస్తుతం హైబ్రిడ్ పద్ధతిని అవలంభిస్తోంది. దీని ప్రకారం ఇన్ఫీ ఉద్యోగులు నెలకు పది రోజులు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. ఉద్యోగులు వారంలో ఐదు రోజులు.. రోజుకు సగటున 9:15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ సమయం పనిచేస్తున్న వారిని హెచ్‌ఆర్ విభాగం గుర్తించి వారికి వ్యక్తిగతంగా ఈమెయిల్స్ పంపుతోంది. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న వారికి ఏ రోజు ఎన్ని గంటలు పనిచేసిందీ ఈమెయిల్‌లో పేర్కొంటోంది. పనివేళలు ముగిసిన వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, పని మధ్యలో విరామం తప్పనిసరి అని ఆ మెయిల్స్‌లో సూచిస్తోంది. పని గంటల తర్వాత ఆఫీస్ పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తోంది. నారాయణమూర్తి వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యం, వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ఇన్ఫీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# ఆంధ్రప్రదేశ్

## కోడెల శివప్రసాద్ జయంతి

### నివాళి అర్పించిన చంద్రబాబు, లోకేశ్

అమరావతి,మే2 : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కోడెల శివప్రసాద రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళు లర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ... పేదలకు రూపాయి వైద్యుడిగా కోడెల సేవలందించారని గుర్తు చేశారు. సంఘ విద్రోహ శక్తులు, ఫ్యాక్షనిస్టులకు ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారన్నారు. పల్నాడు అభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి ఉన్న నాయకుడు కోడెల శివప్రసాదరావు అంటూ సీఎం చంద్రబాబు కొనియాడారు. 'తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొడాలి శివప్రసాద్ రావు జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. 'రూపాయి డాక్టర్'గా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా పల్నాడు అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. నూతన ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్పీకర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. పల్నాడు టైగర్‌గా ప్రసిద్ధి చెందిన కొడాలి శివప్రసాద్ రావు జయంతి సందర్భంగా పార్టీకి, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకుందామని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## సింగపూర్‌లో విద్యావిధానం అమలు

### పర్యటనకు 37మంది టీచర్ల ఎంపిక

### 4 నుంచి 9 వరకు పర్యటించనున్న బృందం

అమరావతి,మే2 : ఏపీలోని ఉత్తమ ఉపాధ్యాయులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం.. సింగపూర్‌కు వెళ్లనుంది. ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో ఈ బృందం పర్యటించనుంది. సింగపూర్ పర్యటనకు ఏపీలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో బృందాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సింగపూర్‌లో అత్యాధునిక విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల్లో అమలవుతున్న వినూత్న ప్రయోగాలు, విద్యార్థుల అభివృద్ధి వ్యవస్థలను ఉపాధ్యాయులు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఈ బృందం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అక్కడి నుంచి సింగపూర్‌కు విమానం ద్వారా ప్రయాణించనున్నారు. మిగిలిన ఉత్తమ ఉపాధ్యాయులను అధ్యయనం కోసం త్వరలో ఫిన్లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక విద్యలో ప్రపంచానికే ఫిన్లాండ్ ఆదర్శంగా నిలిచింది. ఈ రెండు దేశాల అనుభవాలను వినియోగించి ఏపీలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన.

## ఇద్దరిని మిగిన ఈత సరదా

నెల్లూరు,మే2 : నెల్లూరు జిల్లా సైదాపురం చెరువుగుంట ప్రాంతంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన చిన్నారులు.. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగిపోయారు. ఈ దుర్ఘటనలో మృతిచెందిన చిన్నారులను చందు (13), లక్కీ (12)గా గుర్తించారు. చిన్న వయసులోనే పిల్లలు ఇలా మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రియుడి మోసంపై ఫిర్యాదు

### పోలీస్ స్టేషన్ భవనంపై నుంచి దూకిని యువతి

నిజామాబాద్,మే2 : నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యకు యత్నించింది. పోలీస్‌స్టేషన్ భవనంపై నుంచి దూకేసింది. బాల్కొండకు చెందిన సాయికుమార్‌తో గత కొన్నాళ్లుగా ఆ యువతి ప్రేమలో ఉంది. అంతకుముందే సాయికుమార్‌కు పెళ్లయింది. కానీ, ఆ విషయాన్ని ఆమె వద్ద దాచిపెట్టాడు. పెళ్లి విషయం దాచిపెట్టి మోసం చేశాడని యువతి మనస్తాపానికి గురైంది. అతడిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఫిర్యాదు చేసిన అనంతరం.. స్టేషన్ భవనం నుంచి కిందికి దూకేసింది. తీవ్రంగా గాయపడిన యువతిని పోలీసులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

## ఆయుర్వేద కళాశాలలో లైంగిక వేధింపుల కేసు

### ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్ సస్పెన్షన్

అమరావతి,మే2 : విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో లైంగిక వేధింపుల వ్యవహారంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఘటనపై విచారణ అనంతరం ప్రొఫెసర్ దేవదత్ మౌళీనాయక్, ల్యాబ్ టెక్నీషియన్ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేసింది. విద్యార్థినుల ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్, మరో అధ్యాపకురాలిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఆయుష్ విభాగం కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే.

## గొడవ తర్వాత కుమారుడు ఆత్మహత్య.. తట్టుకోలేక ఉరివేసుకున్న తల్లి

లక్నో: తల్లితో గొడవ కారణంగా ఒక వ్యక్తి విషం తాగి చనిపోయాడు. అయితే కుమారుడి మరణాన్ని తల్లి తట్టుకోలేకపోయింది. చీరతో ఉరివేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. తల్లి, కుమారుడి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. (ాశీఅ ంబఱఱషెఱనవ, ఎశీఖ్రవతీ ఘ్ఱఅస్త్రం) ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 21 ఏళ్ల వివేక్ కుమార్ శుక్రవారం సాయంత్రం 55 ఏళ్ల తల్లి గుడ్డిదేవితో గొడవపడ్డాడు. ఆ తర్వాత విషం సేవించి సూసైడ్ చేసుకున్నాడు. కాగా, ఇంట్లో కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి షాక్ అయ్యింది. తీవ్ర దుఃఖానికి లోనైన ఆమె చీరతో ఉరి వేసుకున్నది. తల్లి, కుమారుడి ఆత్మహత్యల గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటికి చేరుకున్నారు. చట్టపరమైన లాంఛనాల తర్వాత ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# పదిలమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

### అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కారం

### మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచన



విజయవాడ,మే2 : విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తున్నానని, ఈ విజయం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సత్కరించారు. అధికారులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుచేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గరిష్ఠంగా 595 మార్కులు రాగా.. 31 మంది విద్యార్థులు 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 376 మంది విద్యార్థులకు 550కు పైగా మార్కులు వచ్చాయని అదేవిధంగా 1,557 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరని పేర్కొన్నారు. పదో తరగతి విజయాన్ని ఒక మొదటి మెట్టుగా భావించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. విద్యార్థుల విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని.. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలిగారని అభినందించారు. జిల్లా అభివృద్ధికి విద్యార్థులే చోదకశక్తులని పేర్కొంటూ, పోటీ ప్రపంచంలో ముందుండేందుకు లక్ష్యాలను చేరుకునే వరకు విశ్రమించకుండా పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో సాంబశివరావు, సమగ్రశిక్ష ఏపీసీ రమేష్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ సెక్రటరీ ఉమర్ అలీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవం దెబ్బతీస్తే ఊరుకోం

### ఆకివీడు రామాలయ ఘటనపై మందకృష్ణ మాదిగ

ఆకివీడు,మే2 : ఆకివీడు పెద్దపేట రామాలయం అంశంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ స్పందించారు. దళిత వర్గాలకు చెందిన వారిని ఎవరు ఇబ్బంది పెట్టినా, ఆత్మ గౌరవం దెబ్బ తీసేలా వ్యవహరించినా ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమపై దాడి చేసే వాళ్లు ఏ స్థాయి వారైనా సరే ఉమ్మడిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఆకివీడు దళితవాడలోని గుడి విషయంలో కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నట్లు కృష్ణ మాదిగ తెలిపారు. అక్కడ గొంతేనమ్మ గుడి, గ్రామ సావిడి, రామాలయం ఉందా? అనే అంశంలో న్యాయస్థానం తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వివాదమంతా ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చుట్టూ తిరుగుతోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వ గెలుపులో తాము ప్రధాన భాగస్వాములుగా ఉన్నామని మందకృష్ణ గుర్తు చేశారు. రామాలయం వివాదాన్ని తానే స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా మాట్లాడే మాటలు.. రఘురామ ఉన్న పార్టీకి మేలు చేయాలే తప్ప కీడు చేయకూడదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో రఘురామ ఉన్నారని.. ఆయన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని పార్టీకి, ప్రభుత్వానికి దూరం చేసేవిగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా దళితులను అవమానించే విధంగా డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు ఉన్నాయని మందకృష్ణ ఆగ్రహించారు.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

### ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు

హైదరాబాద్,మే2 : తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ' అనే అంతర్జాతీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్ ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

## ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనం

### ఆర్యవైశ్య మహాసభ అట్టర్ ప్లాప్

### తెలంగాణ నేతల బహిష్కరణ

### రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యామ్ సుందర్

హైదరాబాద్,మే2 : తెలంగాణ ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనమే కొనసాగుతోందని, తెలంగాణ వైశ్యనేతలు దూరంగా ఉండటమే ఇందుకు కారణమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యాంసుందర్ ఆరోపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా అమరవాది లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేయగా, జరిగిన సభ ఆశించిన స్థాయిలో సాగకపోగా, అట్టర్ ఎ÷-లాప్ అయిందని ఆయన అన్నారు. కేవలం ఆంధ్ర నాయకులకే పరిమితమైన ఈ సభకు తెలంగాణ నేతలెవరూ హాజరు కాలేదని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అమరవాది ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తెలంగాణ ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో బహిష్కరించడం ద్వారా అమరవాది వర్గానికి గట్టి బుద్ధి చెప్పారని శ్యామ్ విమర్శించారు. ముఖ్యంగా వైశ్య పితామహుడు గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గణేళిష్ గుప్త, వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ సుజాత, వంటి హేమాహేమిలతో పాటు వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, బొల్లం సంపత్ వంటి వారు అమరవాది ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదన్నారు. ప్రోటోకాల్ ఉన్న నాయకులు సైతం ఈ 'అక్రమ ఎన్నిక'ను నిరసిస్తూ దూరంగా ఉండటం, అమరవాది వర్గం పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అమరవాది వర్గానికి తెలంగాణ వైశ్య సమాజం ఈ విధంగా చెంపదెబ్బ కొట్టిందని శ్యాంసుందర్ మండిపడ్డారు. నిన్నటి వరకు ఆంధ్ర నేతలను విమర్శించిన వారే, నేడు టీజీ వెంకటేష్, కనకరాజు వంటి ఆంధ్ర నాయకుల అండ కోసం పాకులాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గతంలో శ్రీశైలం సత్రం విషయంలో ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టిన అమరవాది, ఇప్పుడు తన పదవి కోసం ఆంధ్ర నేతలను ఆశ్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 2-3 ఓట్ల సాంకేతిక మెజారిటీతో, అంగబలం, అర్థబలంతో గెలిచినంత మాత్రాన అది నిజమైన విజయం కాదని, తనకు వచ్చిన 520 ఓట్లు నీతినిజాయితీకి ప్రతీకలని ఆయన స్పష్టం చేశారు.÷శివలం కొద్దిమంది రైస్ మిల్లర్ల నాయకులతో తూతూమంత్రంగా సభ జరుపుకోవడం హాస్యాస్పదమని, ఈ అక్రమ పదవి శాశ్వతం కాదని ఆయన హెచ్చరించారు. వైశ్య మహాసభలో జరిగిన అక్రమాలు, అన్యాయంపై త్వరలోనే న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామని, తప్పు చేసిన వారికి కోర్టు ద్వారా బుద్ధి చెబుతామని శ్యాంసుందర్ హెచ్చరించారు. పదవుల కోసం, వ్యాపారాల కోసం కొందరు బానిసలుగా మారవచ్చు కానీ, ఆత్మాభిమానం ఉన్న ఆర్యవైశ్య జాతి అన్యాయాన్ని ఎప్పుడూ సహించదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పేరుతో ఆంధ్రా నేతలతో సభ నిర్వహించి అమరవాది వర్గం ఏకాకిగా మిగిలిపోయిందని, భవిష్యత్తులో తమ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కాంట్రాక్టర్లను బెదిరిస్తున్న కెటిఆర్, హరీష్

### కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి, అద్దంకిల ఆరోపణలు

హైదరాబాద్,మే2 : హ్యామ్‌రోడ్లకు టెండర్లు వేసిన వారిని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ అరాచకాల వల్ల పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుకు ఆదాయం తప్ప ప్రజా సమస్యలు పట్టవా? అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. వివిధ శాఖలు, ప్రాజెక్టులపై అనవసర ఆరోపణలు చేసి కాంట్రాక్టర్లను లొంగదీసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్‌రావు బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్లు అని వ్యాఖ్యానించారు. రాజకీయ అస్తిత్వం కోసమే వారిద్దరు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు.

## జైలు నిబంధనల మేరకే అనంతబాబుకు సదుపాయాలు

రాజమండ్రి,మే2 : రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారంపై జైలు అధికారులు స్పందించారు. అనంతబాబు జైల్లో ప్రత్యేక సదుపాయాలు కోరిన విషయం వాస్తవమేనని అధికారులు అంగీకరించారు. అయితే జైలు నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాల ప్రకారం మాత్రమే సదుపాయాలు కల్పిస్తామని ఆయనకు స్పష్టంగా తెలియజేసినట్లు అధికారులు వెల్లడించారు. జైలు నిబంధనలకు లోబడి ఖైదీలకు అవసరమైన సదుపాయాలు మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు.

## ముదినేపల్లి మండలంలో రోడ్డు ప్రమాదం

### పెళ్లి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన టెక్కీ

ఏలూరు,మే2 : ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం చినపాలపర్రు జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న టిప్పర్‌ను కారు ఢీ కొన్న ఘటనలో అమెరికాలో ఉంటున్న టెక్కీ జయరాం (27) ప్రాణాలు కోల్పోయాడు. వనదుర్రు గ్రామానికి చెందిన జయరాం.. తన బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికికై హాజరై తిరిగి అమెరికా వెళ్లేందుకు.. శనివారం తెల్లవారు జామున రోడ్డు మార్గంలో హైదరాబాద్ పయనమయ్యాడు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో చినపాలపర్రు సమీపంలో కారు రోడ్డుకు అపసవ్యదిశలో ప్రయాణించి రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో చిక్కుకున్న జయరాం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. జయరాం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

## అత్యాచార కేసు వ్యవహారం

### సీఐ చిన్నమల్లయ్యపై సస్పెన్షన్ వేటు

గుంటూరు,మే2 : మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ చిన్నమల్లయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. అతడిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉంటున్న తనపై సీఐ చిన్న మల్లయ్య అత్యాచారానికి పాల్పడ్డాడని ఓ మహిళ బుధవారం వినుకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు అత్యాచారానికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అతడిని సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల క్రితం వరకు సీఐడీలో పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న సీఐ.. వైకాపాకు అనుకూలంగా ఉంటూ తెదేపా వారిని ఇబ్బందిపెట్టారు. 2024లో కారంపూడిలో ఓ తెదేపా నాయకుడిని గన్‌తో బెదిరించారు. ఇటీవలే కారంపూడికి చెందిన మండల తెదేపా నేతను వాట్సప్‌లో బెదిరింపులకు గురిచేసినట్లు గతంలో వార్తలు వచ్చాయి.

## కుటుంబ కలహాలతో పిల్లకు విషమిచ్చిన తండ్రి

నంద్యాల,మే2 : నంద్యాల జిల్లాలోని బనగానపల్లె మండలం చిన్నరాజుపాలెంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలకు కూల్‌డ్రింక్‌లో విషమిచ్చి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. చిన్నరాజుపాలెంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి కొద్ది రోజులుగా కుటుంబ పరమైన విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్తాపం చెందిన ఆ తండ్రి.. తన ఇద్దరు పిల్లలకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించాడు. కొద్దిసేపటికే పిల్లలు అస్వస్థతకు గురికావడంతో స్థానికులు గమనించారు. హుటాహుటిన బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




# జూన్ 26న లెనిన్ విడుదల

'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు

రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.




# 94 ఏళ్ల వయలుసు సింగీతం మెగాఫోన్


### సింగ్ గీతం మూవీతో మళ్లీ సత్తా చాటేందుకు రెడీ

భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

# పృథ్వీరాజన్ సుకుమారన్... ఐ నోబడీ

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.





# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

### దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్

వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ . ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.




# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

### టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు

ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. కేన్స్ ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com